ఈనాడు
యాదాద్రి భువనగిరి
మంగళవారం 29 ఆగస్టు 2017 16 పేజీలు

పాలకుల వల్లే..



జలాశయం వద్దకు ర్యాలీగా వెళ్తున్న సీపీఎం నాయకులు

పాలకుల అసమర్థత వల్లే రాష్ట్రంలోని జలాశయాలు నీళ్లు లేకుండా ఎండిపోయాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. అల్మట్టి జలాశయం నుంచి సాగరకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నాగార్జునసాగర్ డ్యాం వద్ద ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో ఉమ్మడి నల్గొండ., ఖమ్మం జిల్లాలకు చెందిన కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

- జిల్లా 16లో

ఆదాయం నేలచూపులు



- ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో తగ్గిన రిజిస్ట్రేషన్ల రాబడి
- కొనుగోళ్లకు నగదు సర్దుబాటు కాకపోవడమే కారణం

ఈనాడు, యాదాద్రి:

పెద్ద నోట్ల రద్దు ప్రభావం నుంచి ప్రభుత్వానికి అత్యధికంగా రెవెన్యూ తెచ్చిపెడుతున్న రిజిస్ట్రేషన్ శాఖ ఇంకా బయటపడలేకపోతోంది. గతంతో పోలిస్తే ఆశించినంత నగదు సరఫరా లేకపోవడం, బ్యాంకుల్లో ఖాతాల లావాదేవీలపై ఆంక్షలు తదితర కారణాలు రిజిస్ట్రేషన్ ఆదాయం తగ్గడానికి కారణాలుగా అధికారులు పేర్కొంటున్నారు. భారీ మొత్తం పెట్టి ఏదైనా భూములు క్రయవిక్రయాలు చేయడానికి చేతిలో నగదు లేకపోవడమూ ఈ ఆదాయం మందగించడానికి మరో కారణం. ఈ ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల (ఏప్రిల్ నుంచి జులై వరకు) రాబడి గతేడాదితో పోలిస్తే ఉమ్మడి జిల్లాలోని మొత్తం 15 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో సగటున రూ.5.63 కోట్ల మేర తగ్గింది. ఒక్క భువనగిరి, యాదగిరిగుట్టల్లోనే దాదాపు గతేడాది లక్ష్యంలో దాదాపు రూ.నాలుగు కోట్ల మేర తగ్గింది. దీన్ని బట్టి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పెద్ద నోట్లు రద్దు అయి దాదాపు పది నెలలు కావస్తున్నా ఆ ప్రభావం ఇంకా ఈ శాఖ పరిధిలో కొనసాగుతుందనడానికి రాబడి తగ్గదలే నిదర్శనం. రాజధాని హైదరాబాద్‌కు దగ్గరగా ఉండటం, మూడు జిల్లాల మీదుగా హైదరాబాద్ - విజయవాడ రహదారి, అద్దంకి - నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి వెళ్తుండటంతో స్థిరాస్తి వ్యాపారం ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడ క్రయవిక్రయాలు జోరుగా సాగుతుంటాయి. దీనివల్ల రిజిస్ట్రేషన్ శాఖకు గణనీయమైన ఆదాయం సమకూరేది.

మందకొడిగా క్రయవిక్రయాలు

నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల పరిధిలో 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుండగా... ప్రస్తుతం కార్యాలయాల్లో క్రయవిక్రయాలు మందకొడిగా సాగుతున్నాయి. గతేడాది నవంబరు 8న జరిగిన పెద్దనోట్ల రద్దు తర్వాత యాదాద్రి జిల్లాలోని భువనగిరి, యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ఆదాయం మిగిలిన వాటితో పోలిస్తే చాలా తగ్గింది. గతేడాది తొలి నాలుగు నెలలతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో భువనగిరిలో రూ.1.85 కోట్లు, యాదగిరిగుట్టలో రూ.2.43 కోట్ల ఆదాయం తగ్గింది. మరోవైపు దేవరకొండ, నిడమనూరు, రామన్నపేట, సూర్యాపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల రాబడి గతేడాదితో పోలిస్తే పెరగడం విశేషం.



దస్తావేజులదీ అదే తీరు

పెద్ద నోట్ల రద్దుకు ముందు గత ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో 53,611 రిజిస్ట్రేషన్ దస్తావేజులు రాగా... 2017 జులై మాసం ముగిసే నాటికి 41,853 రిజిస్ట్రేషన్లు మాత్రమే నమోదయ్యాయి. ఇప్పుడిప్పుడే నగదు చెలామణీ మునుపటి స్థాయిలోకి వస్తుండటంతో వచ్చే నాలుగైదు నెలల్లో రాబడి పెరిగే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు 'ఈనాడు'కు వెల్లడించాయి.

స్థిరాస్తి వ్యాపారం తగ్గింది

పెద్ద నోట్ల రద్దు ప్రభావం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాం. రాబడి తగ్గడానికి ప్రధాన కారణం ఇదే. ప్రస్తుతం వానాకాలం సీజన్ నడుస్తుండటంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. స్థిరాస్తి వ్యాపారం గతంతో పోలిస్తే జిల్లాలో తగ్గింది. దీంతో సహజంగానే ఇవన్నీ రాబడిని ప్రభావితం చేశాయి. వీటికి తోడు కొంత కాలంగా సాంకేతిక సమస్యలూ (మిగతా 7లో)

360° ల్లో నిఘా



- నిమజ్జనానికి భారీ బందోబస్తు
- అన్ని ప్రాంతాల్లో వీడియో చిత్రీకరణ
- ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

భువనగిరి, న్యూస్‌టుడే: గణేశ్ శోభాయాత్రను పురస్కరించుకుని జిల్లాలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు భువనగిరి జోన్ డీజీపీ పీవై గిరి తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లను సోమవారం ఆయన 'న్యూస్‌టుడే'కు వివరించారు. శోభాయాత్ర, బక్రీద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ప్రణాళికాబద్ధంగా నిఘా వ్యవస్థను పటిష్ఠం చేశామని వెల్లడించారు. భువనగిరి, చౌటుప్పల్ సబ్‌డివిజన్లలో బందోబస్తు ఏర్పాట్ల బాధ్యతను ఆయా ఏసీపీలు మోహన్‌రెడ్డి, స్నేహితకు, ట్రాఫిక్ నియంత్రణ ట్రాఫిక్ ఏసీపీకి అప్పగించినట్లు వెల్లడించారు. జిల్లాలోని సిబ్బందితో పాటు అదనపు బలగాల కోసం రాచకొండ కమిషనర్‌ను కోరామని, కీలక ప్రాంతాలు, నిమజ్జన ప్రదేశాల్లో 24గంటలు పహారా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 2,510 విగ్రహాలు (మిగతా 7లో)



యాదాద్రీశునికి శ్రావణ మాసంలో రూ.6 కోట్లకు పైగా ఆదాయం చేకూరగా.., హుండీ ద్వారా రూ.1,00,93,202 లభించింది. హుండీ ద్వారా ఇంత పెద్దమొత్తంలో ఆదాయం రావడం బాలాలయం ఏర్పాటు తర్వాత ఇది మొదటిసారి. సోమవారం ఆలయంలో జరిగిన లెక్కింపు కార్యక్రమాన్ని ఆలయ ఈవో గీత పర్యవేక్షించారు. -6లో

అలిషా పనే!



- అలీషా గ్యాంగుపై పోలీసుల కన్ను
- సిగరెట్ల దొంగల కోసం కొనసాగుతున్న వేట
- అంతర్రాష్ట్ర ముఠాల ప్రమేయంపై ఆరా

చౌటుప్పల్ గ్రామీణం, న్యూస్‌టుడే: రూ.4.10 కోట్లు విలువచేసే సిగరెట్ల దోపిడీలో అలీషా గ్యాంగు హస్తం ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. గతంలో కూడా ఈ గ్యాంగు ఈ తరహా దోపిడీ చేసింది. ఈనేపథ్యంలో ఆ గ్యాంగు కార్యకలాపాలపై పోలీసులు ఆరాతీస్తున్నారు. ఈనెల 20 తేదీన హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై జరిగిన రూ.4.10 కోట్లు విలువ చేసే సిగరెట్ల అపహరణ కేసు రాష్ట్రంలోనే సంచలనం రేకెత్తించింది. ఈ భారీ దారి దోపిడీ కేసును ఛేదించేందుకు రాచకొండ కమిషనరేట్ పోలీసులు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. ఘటన జరిగి వారం రోజులు దాటినా దుండగులకు సంబంధించిన ఆధారాలు చిక్కలేదు. ఇది కచ్చితంగా అంతరాష్ట్ర ముఠాల ప్రమేయమేనని పోలీసులు భావిస్తున్నారు. దుండగులు మొదట చోరీకి యత్నించింది హయత్‌నగర్ ఠాణా పరిధిలోని పెద్దఅంబర్‌పేట్ వద్ద కాగా. . కంటైనరు (లారీ)లోని సిగరెట్లను మాయం చేసింది చౌటుప్పల్ ఠాణా పరిధిలో. దీంతో ఇరు ప్రాంతాల పోలీసులు దుండగుల కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

పక్కా సమాచారంతోనే..

ముషీరాబాద్ నుంచి చిత్తూరు జిల్లా రేణిగుంటకు వెళ్తున్న కంటైనరును పక్కా సమాచారంతోనే దుండగులు హైజాక్ చేసి దోపిడీ చేసినట్టు పోలీసులు భావిస్తున్నారు. కంటైనరు బయలుదేరిన ముషీరాబాద్‌లోని కోస్టల్ రోడ్ వేస్ ట్రాన్స్‌పోర్టు నుంచి జాతీయ రహదారి వెంట ఉన్న సీసీ ఫుటేజీలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. చౌటుప్పల్ మండలం కైతాపురం వద్ద కంటైనరును దుండగులు వదిలి.. మరో లారీలో వెళ్లే దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి. రాత్రివేళ కావడం, సీసీ కెమెరాలు దూరంగా ఉండటంతో లారీ నెంబరు సరిగ్గా కనిపించలేదు. ముషీరాబాద్ నుంచి అంబర్‌పేట వరకు ఓ ఇన్నోవా కారు వెంట రావడం సీసీ కెమెరాల్లో గుర్తించారు. కాగా.. నిందితులు ఆ కారులోనే వచ్చారా అనే కోణంలో (మిగతా 7లో)

ఆర్టీసీకి ఆదాయం.. ప్రయాణికులకు సౌకర్యం



జిల్లాకు పెరగనున్న బస్సులు

నూతన రూట్లకు పర్మిట్లు

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: నల్గొండ ఆర్టీసీ రీజియన్ పరిధిలోని డిపోల నుంచి ఏపీతో పాటు ఇతర రాష్ట్రాలకు బస్సు సర్వీసులను నడిపే అవకాశం వచ్చింది. ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కువగా ఆంధ్ర ప్రాంతం నుంచి తెలంగాణకు బస్సులు నడిపే వారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీకి నూతనంగా 221 బస్సులు ఇతర రాష్ట్రాల్లో నడిపించేలా పర్మిట్లు వచ్చాయి. రీజియన్‌కు 20 వరకు కొత్త రూట్లలో బస్సులు ఏర్పాటు చేసే వీలు కలుగనుంది. దీనివల్ల నల్గొండ రీజియన్‌కు ఆదాయం పెరగనుంది. ఫలితంగా జిల్లాకు మరిన్ని కొత్త బస్సులు వస్తాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్ర ప్రాంతం నుంచి తెలంగాణకు 85 శాతం వరకు, తెలంగాణ నుంచి ఆంధ్ర ప్రాంతానికి 15 శాతం వరకు బస్సులు నడిపే వారు. ఆదాయం గురించి రెండు ప్రాంతాల వారికి ఏమంత పట్టింపు లుండేవి కావు. విభజన తర్వాత ఇరు ప్రాంతాల అధికారులు ఆదాయంపై దృష్టి సారించారు. ఈ తరుణంలో రెండు రాష్ట్రాల ఆర్టీసీ యాజమాన్యాలు ఒక నిర్ణయానికి వచ్చాయి.

పెరుగనున్న ఆదాయం

ఆర్టీసీ నల్గొండ రీజియన్‌కు రోజు రూ.80 లక్షల ఆదాయం వస్తుంది. కొత్త రూట్లలో బస్సులను నడిపిస్తే మరింత ఆదాయం పెరగనుంది. మిర్యాలగూడ తప్ప అన్ని డిపోలు నష్టాలలోనే నడుస్తున్నాయి. బస్సుల సంఖ్య పెరిగితే కొంత వెసులు బాటు దొరకనుంది. టీఎస్ ఆర్టీసీకి నూతనంగా 221 రూట్లలో బస్సులు నడిపే అవకాశం వచ్చింది. ఈ నేపథ్యంలో నల్గొండ రీజియన్‌కు 20 కొత్త రూట్లకు బస్సులు తిప్పే అవకాశం త్వరలో రానుంది. దీనికి కావాల్సిన పర్మిట్ల కోసం అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

త్వరలో నూతన రూట్లకు బస్సులు నడిపే అవకాశం

కొత్త బస్సులు జిల్లాలోని కేటాయించిన డిపోల ద్వారా హైదరాబాదు మీదుగా ఆయా ప్రాంతాలకు వెళతాయి. దీనివల్ల ఆదాయం అధికంగా వస్తుందని అధికారులు భావిస్తున్నారు.
మిర్యాలగూడ నుంచి గోవాకు రెండు రాజధాని ఏసీ బస్సులను నడుపుతారు.
నార్కట్‌పల్లి నుంచి కర్ణాటక రాష్ట్రం లింగసూరు వరకు.
జిల్లా నుంచి మహారాష్ట్రకు.

కొత్త సర్వీసులు ఇలా...

సూర్యాపేట నుంచి రాజమహేంద్రవరానికి రెండు బస్సులు నడుపుతున్నారు.
కోదాడ నుంచి రాజమహేంద్రవరానికి నాలుగు బస్సులు నడుపుతున్నారు.
సూర్యాపేట నుంచి హైదరాబాదు మీదుగా రాజమండ్రికి బస్సు సౌకర్యం.
జిల్లా నుంచి బాపట్లకు
జిల్లా నుంచి కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు.
జిల్లా నుంచి సోలాపూర్‌కు బస్సులు నడుపుతారు.

నూతన రూట్లలో బస్సులు నడిపే అవకాశం వచ్చింది..:

విజయకుమార్, నల్గొండ ఆర్టీసీ ప్రాంతీయ అధికారి



ఆర్టీసీ యాజమాన్యం తీసుకున్న నిర్ణయం వల్ల కొత్త రూట్లలో బస్సులను నడిపే అవకాశం వచ్చింది. కొత్తగా బస్సులు కూడా రానున్నాయి. గోవాకు రెండు రాజధాని ఏసీ బస్సులను నడుపుతాం. ఆ బస్సులు తయారీలో ఉన్నాయి. ఆదాయం కూడా పెరుగుతుంది. ఇతర రాష్ట్రాలకు వెళ్లే బస్సులు వయా హైదరాబాదు మీదుగా వెళ్తాయి.

అప్పుల బాధతో రైతు బలవన్మరణం

నాంపల్లి (మర్రిగూడ), న్యూస్‌టుడే: అప్పుల బాధ తాళలేక రైతు బలవన్మరణానికి పాల్పడిన ఘటన నాంపల్లి మండలం మహ్మదాపురంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై వేల్పుల తెలిపిన వివరాల ప్రకారం... మహ్మదాపురం గ్రామానికి చెందిన రాసిక యాదయ్య(35) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయం కోసం చేసిన అప్పులు పెరిగిపోవడంతో పంటలు పండక చేసిన అప్పులు తీర్చేమార్గం లేక సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగారు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. మృతుడికి ముగ్గురు కుమారులున్నారు. శవ పరీక్ష నిమిత్తం దేవరకొండకు పంపించినట్లు, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: రైలు ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన ఘటన పట్టణంలోని ఎస్టీ వసతిగృహం సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద సోమవారం చోటుచేసుకుంది. రైల్వే ఎస్‌ఐ ఎల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం. పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన చిన్నగారి నర్సింహ కుమారుడు భాస్కర్(23) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఎస్టీ వసతిగృహం వద్ద రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని మృతిచెందారని అనుమానిస్తున్నారు. కేసును మోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్య మృతికి కారకుడైన భర్త రిమాండ్

చౌటుప్పల్(గ్రామీణం), న్యూస్‌టుడే: వరంగల్ రూరల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన పొలెల్లి వెంకటేశ్వర్లును సోమవారం అరెస్ట్ చేసి రామన్నపేట కోర్టులో హాజరుపరిచినట్లు చౌటుప్పల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎస్.నవీన్‌కుమార్ తెలిపారు. వెంకటేశ్వర్లు కొంత కాలం నుంచి తన భార్య లతతో కలిసి చౌటుప్పల్‌లో నివాసముండేవారు. అతను లింగోజిగూడెంలోని ఆస్టర్ పరిశ్రమలో పని చేస్తుండగా, భార్య లత చౌటుప్పల్‌లోని బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పని చేసేది. భర్త వేధింపులు తాళలేక ఈ నెల 3న లత క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ 8న మృతి చెందింది. వెంకటేశ్వర్లు వేధింపులకు గురిచేయడంతోనే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు నిందితుడు వెంకటేశ్వర్లును కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో నల్గొండ జైలుకు తరలించారు.

వివాహితపై హత్యాయత్నం

తిరుమలగిరి, న్యూస్‌టుడే: తిరుమలగిరి మండల పరిధిలోని అల్వాల గ్రామంలో వివాహితపై అదే గ్రామానికి చెందిన యువకుడు అత్యాచార, హత్యాయత్నం చేసిన సంఘటన సోమవారం జరిగింది. తిరుమలగిరి పోలీసు స్టేషన్ ఏఎస్సై యల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం... అల్వాల గ్రామానికి చెందిన వివాహితపై అదేగ్రామానికి చెందిన దోరెపల్లి చంటి కొంతకాలంగా లైంగికంగా వేధిస్తున్నాడు. సోమవారం పొలం వద్దకు వెళ్తుండగా ఆమెను అనుసరించి బలత్కారానికి యత్నించారని, ఆమె ఎదురు తిరగడంతో కత్తితో హత్యాయత్నం చేశారని తెలిపారు. బాధితురాలి భర్త పగిడిమర్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

తిరుమలగిరిలో టాస్క్‌ఫోర్స్ దాడులు

తిరుమలగిరి, న్యూస్‌టుడే: నల్గొండ జిల్లా తిరుమలగిరిలో సోమవారం ఉదయం వరంగల్ కమిషనరేట్ పరిధిలోని టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోదాలు నిర్వహించారు. సంతోష్ రైస్ ఇండస్ట్రీస్ యజమాని యిమ్మడి సోమనర్సయ్య ఇంట్లో జనగామ టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేశారు. గతంలో పలుమార్లు పీడీఎస్ బియ్యం విషయంలో కేసులు నమోదు కావడంతో తనిఖీలు చేసినట్లు తెలిసింది. మధ్యాహ్నం వరకు ఆస్తిపత్రాలు, నగదు, బంగారం వాటి వివరాలు సేకరించినట్లు తెలియవచ్చింది. సోదాలు పూర్తైన అనంతరం వెళ్తుండగా ఓ అధికారిని వివరాలు వెల్లడించాలని విలేకరులు కోరగా కేసు దర్యాప్తు జరుగుతుంది. పూర్తి వివరాలు కమిషనర్ వెల్లడించనున్నట్లు తెలిపారు. దాడులలో ఏసీపీలు శోభన్‌కుమార్, మురళీధర్, సీఐ శ్రీనివాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



బియ్యంవ్యాపారి ఇంట్లో పోలీసుల సోదాలు

ఆటోను ఢీకొట్టిన లారీ

ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురికి గాయాలు

నెమ్మాని(నార్కట్‌పల్లి గ్రామీణం),న్యూస్‌టుడే: ఆటోను లారీ ఢీకొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు గాయలపాలైన సంఘటన మండలంలోని నెమ్మాని గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... తొండల్వాయికి చెందిన చింత మహేష్ (28) ఆటోడ్రైవర్ ఆయన భార్య రూత్, వీరి కూతురు శారోన్, కుమారుడు రూపన్, రూత్ అమ్మ రాములమ్మ, అక్క కవితతో కలిసి అవురవాణి నుంచి సొంత గ్రామానికి వస్తుండగా వీరు ప్రయాణిస్తున్న ఆటోని మాండ్ర గ్రామంలోని సోలార్ కంపెనీ నుంచి వస్తున్న లారీ నెమ్మాని వద్ద ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న వీరికి గాయాలయ్యాయి చికిత్స నిమిత్తం వెంటనే క్షతగాత్రులను అంబులెన్స్‌లో కామినేని ఆసుపత్రికి తరలించారు. నెమ్మానిలో ప్రమాదం జరగడంతో రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి.



నెమ్మానిలో ఆటోను ఢీకొట్టిన లారీ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము

మహిళా, శిశు, వికలాంగుల మరియు వయో వృద్ధుల శాఖ,

యాదాద్రి భువనగిరి జిల్లా

E - టెండర్ నోటీస్

నెం.:216/A/2016 తేది: 28.08.2017

యాదాద్రి భువనగిరి జిల్లాలోని క్రింద పేర్కొనబడిన 04 ఐ.సి.డి.యస్. ప్రాజెక్టులలోని 864 అంగన్వాడీ కేంద్రములకు అవసరమైన ప్రీ స్కూల్ మెటీరియల్, మెడికల్ కిట్స్, వేయింగ్ మిషన్స్ మరియు MIS రిజిస్టర్లు సరఫరా చేయుటకు ఆసక్తి గల ప్రభుత్వ వాణిజ్య పన్నుల శాఖ నందు రిజిస్టర్డ్ అయిన వ్యాపారస్తుల నుండి టెండర్ కోరనైనది. ప్రీ స్కూల్ మెటీరియల్‌ను సరఫరాదారే నేరుగా ఐసిడిఎస్ ప్రాజెక్టులకు సరఫరా చేయవలసి ఉంటుంది. అంచనా వ్యయం ప్రీ స్కూల్ మెటీరియల్‌కు రూ. 25,10,000/-లు, మెడికల్ కిట్స్‌కు రూ. 8,36,500/-, వేయింగ్ మిషన్స్‌కు రూ. 6,95,386/- మరియు MIS రిజిస్టర్‌లకు 6,45,408/-లు.

మిగతా వివరాలను https://tender.eprocurement.gov.in నందు పొందగలరు. టెండర్ ప్రాసెసింగ్ ఫీజును (రూ. 5000/-) మరియు ఇ.ఎం.డి. 2.5%తో 1% (ప్రీ స్కూల్ మెటీరియల్‌కు రూ. 25,100/-, మెడికల్ కిట్స్‌కు రూ. 8,365/-, వేయింగ్ మిషన్స్‌కు రూ. 6,954/- మరియు MIS రిజిస్టర్‌లకు 6,454/-లు)లను District Welfare Officer, Women, Child, Disabled & Senior Citizen, Yadadribhuvanagiri వారి పేరు మీద డి.డి. చెల్లించవలెను. టెండర్‌ను ఆన్‌లైన్లో https://tender.eprocurement.gov.in నందు మాత్రమే దాఖలు చేయవలెను. టెక్నికల్ బిడ్‌కు సంబంధించిన డాక్యుమెంట్లను, ఇ.ఎం.డి. మరియు ప్రాసెసింగ్ ఫీజును ఈ కార్యాలయం నందు సమర్పించవలెను. ఇ.ఎం.డి. మరియు ప్రాసెసింగ్ ఫీజును చెల్లించని టెండరు దరఖాస్తును తిరస్కరించబడును. ఇ.ఎం.డి. విషయంలో ఎవరికి మినహాయింపు లేదు.

టెండర్ ప్రచురణ తేది	:	29.8.2017
ఆన్‌లైన్ నందు టెండర్ ప్రారంభపు తేది	:	30.8.2017
ప్రీ బిడ్ సమావేశపు తేది	:	07.09.2017
ఆన్‌లైన్ నందు టెండర్ ముగింపు తేది	:	07.09.2017
టెక్నికల్ బిడ్ తెరిచే తేది	:	08.09.2017
ఫైనాన్షియల్ బిడ్ తెరిచే తేది	:	08.09.2017

సం/- జిల్లా సంక్షేమ అధికారి,
మహిళా, శిశు, వికలాంగుల మరియు వయో వృద్ధుల శాఖ,
యాదాద్రి భువనగిరిజిల్లా

సం/-
సంయుక్త కలెక్టర్/ ఛైర్మన్
జిల్లా కొనుగోలు కమిటీ

కేంద్రీయ విద్యాలయం మంజూరు

ఉత్తర్వులు జారీ 'ఈనాడు' కథనాలకు స్పందన.. ప్రత్యేక చొరవ చూపిన ఎంపీ



భువనగిరిలోని కేంద్రీయ విద్యాలయం భవనం

భువనగిరి టౌన్, న్యూస్‌టుడే: భువనగిరి పట్టణానికి కేంద్రీయ విద్యాలయం మంజూరు చేస్తూ కేంద్ర మానవ వనరుల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటును ప్రతిపాదిస్తూ స్థానిక అధికారులు కేంద్ర ప్రభుత్వంలోని కేంద్రీయ విద్యాలయాల సంఘటనకు 30.03.2017న ప్రతిపాదన పంపించారు. ప్రతిపాదిత స్థలం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేస్తు జాయింట్ కమిషనర్ డాక్టర్ ప్రభాకర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు, కొనసాగుతున్న జాప్యంపై పలు దఫాలుగా 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తా కథనాలకు ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ స్పందించారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపారు. విద్యాలయం మంజూరు కోసం ఢిల్లీలోని మానవవనరుల శాఖ అధికారులను పలు దఫాలుగా కలిసి ఒత్తిడి తెచ్చారు. దీంతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 50 కేంద్రీయ విద్యాలయాలను 2017-18 విద్యాసంవత్సరానికి మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ఒకటి భువనగిరికి మంజూరు చేశారు. నెల రోజుల వ్యవధిలో ప్రవేశాలు పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఇక కేవీలో ప్రవేశాల నోటిఫికేషన్ జారీ చేసేందుకు అధికారులు తమ ప్రయత్నాలు ప్రారంభించనున్నారు. ఇప్పటికే భవనాన్ని స్వాధీనం చేసుకున్న కేంద్రీయ విద్యాలయం స్థానిక అధికారులు ఇకపై భవనంలో వసతుల కల్పనపై దృష్టి సారించనున్నారు. పర్చేజ్, ఉపాధ్యాయుల నియామకం ప్రక్రియ ఢిల్లీ స్థాయిలో పూర్తి కానుంది. నెల రోజుల వ్యవధిలో ప్రవేశాల ప్రక్రియ పూర్తి చేసి తరగతులను ప్రారంభించనున్నారు. దీంతో ఎన్నో ఏళ్లుగా కేంద్రీయ విద్యాలయం కోసం ఎదురు చూస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, స్థానిక ప్రజల నిరీక్షణకు తెరపడింది.


దుకాణంలో ఎరువుల బస్తాలు

అమలుకు దూరంగా ఈ-పాస్

అమలులో జాప్యం.. ఇంకా అందని యంత్రాలు

పాత పద్ధతిలోనే ఎరువుల విక్రయాలు

భువనగిరి టౌన్, న్యూస్‌టుడే:

ఎరువుల విక్రయాల్లో అక్రమాలను నియంత్రించేందుకు ఉద్దేశించిన ఈ-పాస్ యంత్రాల వినియోగం ఇంకా జిల్లాలో అందుబాటులోకి రాలేదు. వాటి అమలులో తీవ్ర జాప్యం ఏర్పడుతోంది. రైతులకు ప్రయోజనం చేకూర్చాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఎరువులపై భారీగా రాయితీ ఇస్తోంది. ఎరువుల విక్రయాలపై పర్యవేక్షణ, నిఘా లేకపోవడంతో దశాబ్దాలుగా ఎరువులు నల్ల మార్కెట్‌కు తరలుతున్నాయి. ఈ అక్రమాలను నియంత్రించేందుకు ప్రభుత్వం ఈ-పాస్ యంత్రాల ద్వారానే ఎరువులను విక్రయించాలని నిర్ణయించింది. ఈ విధానంతో ఎరువులు పక్కదారి పట్టకుండా అవసరం ఉన్న వారికే అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ-పాస్ యంత్రాలను అమలు చేయాలనే పట్టుదలతో ఉంది. ఈనెలాఖరు వరకు ఈ-పాస్ యంత్రాలు వినియోగంలోకి తేవాలన్న ఆదేశాలను వ్యవసాయశాఖ అధికారులు పట్టించుకున్నట్లు కనిపించడం లేదు.

ఖరీఫ్ సీజన్ నుంచి ఈ పాస్ యంత్రాల ద్వారానే ఎరువులు విక్రయించాలన్న ప్రభుత్వ నిర్ణయం జిల్లాలో అమలు కావడంలేదు. పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, భూసార పరీక్షల నివేదికను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసిన తదుపరి ఎరువుల విక్రయాలు చేపట్టాల్సి ఉంది. దీంతో ఎరువు అవసరం ఉన్న రైతుకు ఎంత భూమి ఉంది, ఎంత ఎంత ఎరువు అవసరం ఉందో తెలిసిపోతుంది. ఈ వివరాలతో ఎరువును కొన్న రైతు వివరాలు వెంటనే ఈ-పాస్ ద్వారా కేంద్ర ప్రభుత్వ సర్వర్‌కు సమాచారం ఎప్పటికప్పుడు చేరుతుంది. నిజమైన రైతు ఎరువును కొనుగోలు చేసిన పక్షంలోనే ఎరువుల కంపెనీకి రాయితీ జమ అవుతుంది. ఇలా అక్రమాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా ఇంకా ప్రారంభం కాలేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలేదు. నేటికి ఎరువుల దుకాణదారులు పాత పద్ధతిలోనే ఇంకా ఎరువుల విక్రయాలను కొనసాగిస్తున్నారు. దీంతో ఎరువులపై ప్రభుత్వం అందిస్తున్న భారీ రాయితీ పక్కదారి పడుతోంది. ఈ-పాస్ విధానం పక్కాగా అమలు పర్చిన పక్షంలో నిజమైన రైతులకు, ప్రభుత్వానికి ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. ఈ విషయమై జిల్లా వ్యవసాయ అధికారి హరినాథ్‌బాబును వివరణ కోరగా ఈ-పాస్ యంత్రాల ఏర్పాటుకు గడువులేదన్నారు. ఇప్పటికే ఈ విషయమై కోరమండల్ కంపెనీ ప్రతినిధులు వ్యాపారులకు శిక్షణ ఇచ్చారని చెప్పారు. యంత్రాలు సరఫరా కాగానే వ్యాపారులకు అందజేస్తామన్నారు.

గణాంకాలు ఇవి...

జిల్లా వ్యాప్తంగా ఎరువులు విక్రయాలు పాత పద్ధతిలోనే కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 90 ఎరువుల దుకాణాలు ఉన్నప్పటికి ఒక్క దుకాణంలో ఈ-పాస్ యంత్రం ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. ఏటా రబీ, ఖరీఫ్ సీజన్లలో జిల్లా వ్యాప్తంగా సుమారు 3,25,000 మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులు వినియోగిస్తున్నట్లు అంచనా. జిల్లాలోని రైతులు తమ పంట పొలాలకు డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు, యూరియా, పొటాష్, సూపర్ ఫాస్ఫేట్‌ను పైరును బట్టి వినియోగిస్తుంటారు. జిల్లా వ్యాప్తంగా 1,0,4,878 హెక్టార్ల విస్తీర్ణంలో సాగుకు అనుకూలమైన భూములు ఉన్నాయి. ఏటా 94,726 ఎకరాల్లో పలు పంటలను రైతులు సాగుచేస్తున్నారు. గత రబీ సీజన్‌లో 1,58,773 మెట్రిక్ టన్నుల ఎరువులను విక్రయించారు.

'ఈనాడు' కథనానికి స్పందన

ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు

చిలకలగుట్టను పరిశీలించిన మైనింగ్, రెవెన్యూ అధికారులు

నార్కట్‌పల్లి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని చిలకలగుట్టలో నిర్వహిస్తున్న క్రషర్‌క్వారీ ద్వారా ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు విజయలక్ష్మి, మైనింగ్ టెక్నికల్ అసిస్టెంట్ ఏ.శేఖర్‌లు క్వారీ యజమానులకు హెచ్చరించారు. సోమవారం 'ఈనాడు' మినీలో ప్రచురితమైన 'పల్లె గుండెల్లో పేలుళ్ల మోత' కథనానికి స్పందించిన అధికారులు సోమవారం క్వారీని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. క్వారీకి 2023 వరకు అనుమతి ఉన్నట్లు తెలిపారు. ప్రత్యక్ష పరిశీలనలో ఎక్కువ మొత్తంలో రవాణా చేస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో మళ్లీ ప్రత్యక్ష పరిశీలన చేస్తామన్నారు. అధిక శబ్దంతో కూడిన పేలుళ్లు చేయడం మానుకోవాలని సూచించారు. క్వారీకి ఎన్ని ఎకరాల్లో అనుమతి ఉందో అనుమతి పత్రాలను పరిశీలించామన్నారు. దీనిపై అధికారులకు నివేదిక అందజేస్తున్నట్లు తెలిపారు. త్వరలో మళ్లీ పరిసర ప్రాంత రైతులతో మాట్లాడి నివేదిక అందజేయనున్నట్లు తహసీల్దారు తెలిపారు. ఆర్ఐ దమయంతి, వీఆర్వో మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.


క్వారీలో సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దారు విజయలక్ష్మి

పాడి రైతులకు ప్రోత్సాహకం ఇవ్వాలి

భువనగిరి టౌన్, న్యూస్‌టుడే: మదర్ డెయిరీ పరిధిలోని పాడి రైతులకు ప్రోత్సాహకం ఇవ్వాలని ఆ డెయిరీ మాజీ డైరెక్టర్ కాయితి వెంకట్‌రెడ్డి, పాల ఉత్పత్తిదారుల ఫోరం నాయకుడు ననబోలు శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన ఆరు జిల్లాల పాల ఉత్పత్తిదారులు సంఘాల అధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లీటర్ పాలపై రూ. 4 ప్రోత్సాహకం ఇచ్చి రైతులను ఆదుకోవాలని వారు కోరారు. విజయ డెయిరీ తమ రైతులకు లీటర్ పాలపై రూ.4 ప్రోత్సాహకంగా ఇస్తోందన్నారు. మదర్ డెయిరీ పాల ఉత్పత్తిదారులకు అన్ని డెయిరీల కన్న తక్కువ ధర చెల్లిస్తోందని చెప్పారు. దీంతో ఉత్పత్తిదారులు నష్ట పోతున్నారని అన్నారు. మదర్ డెయిరీ కార్యకలాపాలు ఉన్నా ప్రాంతాల్లో విజయ డెయిరీకి కేంద్రాలను ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వవద్దని అన్నారు. 1995 మ్యాక్స్ చట్టంతో కార్యకలాపాలను కొనసాగిస్తున్న మదర్ డెయిరీని ప్రభుత్వం ప్రోత్సహించి కాపాడాలని డిమాండ్ చేశారు. పాల కొరత కారణంగా విజయ డెయిరీ ఇతర రాష్ట్రాల నుంచి పాలను కొనుగోలు చేస్తోందని, ఈ పాలను మదర్‌డెయిరీ నుంచి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పాలకు ప్రోత్సాహకం ఇవ్వాలన్న ప్రధాన డిమాండ్‌తో ఈనెల 31న పట్టణంలోని పాల శీతలీకరణ కేంద్రం నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. ఇందులో ఆరు జిల్లాల పాల సేకరణ కేంద్రాల అధ్యక్షులు పాల్గొంటారని అన్నారు. సమావేశంలో నాయకులు కస్తూరి పాండు, పడమటి పావని, బలరాంరెడ్డి, బీర్ల అయిలయ్య, సోమిరెడ్డి, మనోహర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కాయితి వెంకట్‌రెడ్డి

నేడు జానపద జాతర

భువనగిరి, న్యూస్‌టుడే: ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం భువనగిరిలో జానపద జాతర నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అనితారామచంద్రన్ ఒక ప్రకటనలో తెలిపారు. భాషా సాంస్కృతిక శాఖ, జానపద కళా బృందాలు, సాంస్కృతిక సారథి బృందాలు సంయుక్తంగా ప్రదర్శనలు ఇస్తాయని తెలిపారు. హౌసింగ్ బోర్డులోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో సాయంత్రం 5 గంటల నుంచి కళా ప్రదర్శనలు ప్రారంభమవుతాయన్నారు. జిల్లాలోని జానపద కళాకారులందరూ బృందాలుగా ఏర్పడి ప్రదర్శనలు ఇవ్వాలని పేర్కొన్నారు. తొలుత కళాకారులు తమ కళారూపాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తాయని తెలిపారు. జానపద జాతరలో అన్ని శాఖల అధికారులు, కళాకారులు పాల్గొనాలని కోరారు.

నగదు రహిత లావాదేవీల గ్రామంగా నిలవాలి

శివారెడ్డిగూడెం(భూదాన్‌పోచంపల్లి), న్యూస్‌టుడే: గ్రామంలో పూర్తిస్థాయిలో 100శాతం నగదు రహిత లావాదేవీలు జరిపి జిల్లాలోనే శివారెడ్డిగూడెం గ్రామం ప్రథమస్థానంలో నిలవాలని కలెక్టర్ అనితా రామచంద్రన్ కోరారు. కెనెరా బ్యాంక్ దత్తత తీసుకున్న మండల పరిధిలోని శివారెడ్డిగూడెంను డిజిటల్ గ్రామంగా బ్యాంక్ అధికారులు సోమవారం ప్రకటిస్తూ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కెనెరా బ్యాంక్ ఆధ్వర్యంలో గ్రామాన్ని దత్తత తీసుకొని ఇంటింటికి తిరిగి ప్రతి ఒక్కరికి బ్యాంక్ ఖాతా తెరిపించడంతో పాటు, ఉచిత వైఫై సేవలను అందించి డిజిటల్ గ్రామంగా తీర్చిదిద్దడం అభినందనీయమని ప్రశంసించారు. ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. గ్రామంలో మొబైల్ ఏటీఎం కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే గ్రామంలోని పాఠశాలకు ఒక కంప్యూటర్, గ్రామపంచాయతీకి రెండు కంప్యూటర్లను బ్యాంక్ ఆధ్వర్యంలో అందించారు. స్వయం సహాయక బృందాలకు, ఇతర రుణాలు దాదాపు రూ.4 కోట్లు చెక్కులను అందజేశారు. కెనరా బ్యాంక్ తెలంగాణ రాష్ట్ర జీఎం రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోనే ధాన్యం ఉత్పత్తిలో శివారెడ్డిగూడెం గ్రామం ప్రథమ స్థానంలో ఉందని, ఆ ఉద్దేశంతోనే ఈ గ్రామాన్ని డిజిటల్‌గా తీర్చిదిద్దేందుకు దత్తత తీసుకున్నామన్నారు. అందులో భాగంగానే 100 శాతం ఖాతాలు, వైఫై సేవలు అందించామని చెప్పారు. గ్రామస్థులు డబ్బుల కోసం మండల కేంద్రానికి రాకుండా గ్రామంలోనే బ్యాంక్ కరస్పాండెంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం అత్యధిక దిగుబడులు సాధించిన రైతులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో శిక్షణ ఐఏఎస్ అధికారిణి ప్రియాంక, డీఆర్డీవో వెంకట్రావ్, కెనరా బ్యాంక్ డీఎం కె.రావు, డిప్యూటీ జీఎం ప్రకాష్‌రెడ్డి, వరంగల్ రీజినల్ మేనేజర్ పీవీ రావు, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, ఎంపీపీ సార సరస్వతి, జడ్పీటీసీ సభ్యుడు మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, బీఎస్ఎన్ఎల్ అధికారి సుబ్బారావు, సర్పంచి వారాల పద్మ, ఎంపీటీసీ సభ్యుడు సంతోష్, కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ రేణుశ్రీ, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, పోచంపల్లి మేనేజర్ కృష్ణమోహన్, ఏపీఎం హరి నాయక్ పాల్గొన్నారు.


మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ అనితారామచంద్రన్, కెనెరా బ్యాంక్ జీఎం రాజేందర్‌రెడ్డి, తదితరులు

30 నుంచి జడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

నల్గొండ జిల్లాపరిషత్, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్తు స్థాయీ సంఘాల సమావేశాలు బుధవారం నుంచి నిర్వహించనున్నట్లు సీఈవో హనుమాన్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30న ఉదయం 10.30 గంటలకు స్థానిక జడ్పీ సమావేశం మందిరంలో మహిళ సంక్షేమంపై, అదే సమయానికి సీఈవో కార్యాలయంలో సాంఘిక సంక్షేమంపై, 31న ఉదయం 10.30 గంటలకు జడ్పీ సమావేశం మందిరంలో పనులు, నిధులుపై సమీక్ష జరగనుందన్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

రైతులు సకాలంలో రుణాలు చెల్లించాలి

వలిగొండ, న్యూస్‌టుడే: రైతులు తీసుకున్న దీర్ఘ, స్వల్పకాలిక రుణాలను సకాలంలో చెల్లిస్తే తిరిగి రుణ వసతి కల్పిస్తామని జిల్లా సహకార బ్యాంక్ అధికారి డాక్టర్ లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. సోమవారం వలిగొండలోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ ప్రాంగణంలో సంఘం సభ్యులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రుణాలు సకాలంలో చెల్లించినపుడే సంఘాలు బలోపేతం అవుతాయని అన్నారు. పీఏసీఎస్‌లు ప్రభుత్వ సంస్థలు కావని, స్వయంప్రతిపత్తి సంఘాలన్నారు. రైతులు వాటి అభ్యున్నతికి తోడ్పాటు అందించాలన్నారు. ఇప్పటికే సంఘాల ద్వారా ఎరువులు, విత్తనాలను విక్రయించడం, వరి ధాన్యాన్ని కొనుగోలు వంటి రైతు సేవ కార్యక్రమాలు చేపడుతున్నాయని చెప్పారు. తద్వారా సమకూరే ఆదాయంతో రైతులకే తిరిగి రుణవసతికే సమకూర్చుతామని చెప్పారు. పీఏసీఎస్ అధ్యక్షుడు సురికంటి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సహకార యూనియన్ లెక్చరర్ వెంకటేశ్వర్‌రావు, బ్యాంకు మేనేజర్ షరీఫ్, ఉపాధ్యక్షురాలు జానకమ్మ, డిప్యూటీ రిజిస్ట్రార్ శ్రీనివాస్, పాలకవర్గం సభ్యుడు జూకంటి నర్సింహ, ముత్యాలు, సాలయ్య, కిష్టయ్య, రామచందర్, సత్తిరెడ్డి, వెంకయ్య, వీరారెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆలేరు

ఆర్థిక సహాయం అందజేత

దత్తాయిపల్లి (తుర్కపల్లి), న్యూస్‌టుడే: దత్తాయిపల్లి గ్రామానికి చెందిన జేరిపోతుల నర్సయ్య (52) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. తెలంగాణ పరిరక్షణ సమితి కన్వీనర్ కల్లూరి రామచంద్రారెడ్డి తరుపున సమితి సభ్యులు యాదగిరి, వెంకటస్వామి రూ.5వేలు ఆర్థిక సహాయం కుటుంబానికి సోమవారం అందజేశారు. ధ్యానబోయిన సత్యనారాయణ, ఎరుకల వెంకటేశ్‌గౌడ్, వీసం రాజయ్య, దేవరుప్పల మల్లేషం, దార్ల దుర్గయ్య, మాతయ్య, బాలయ్య పాల్గొన్నారు.

కూలీల వేతనాలు చెల్లించాలి

గుండాల, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేసిన కూలీల వేతనాలు వెంటనే చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి మద్దెపురం రాజు అన్నారు. సోమవారం గుండాల ఎంపీడీవోకు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. సత్యనారాయణ, సోమయ్య, కిష్టయ్య, ఖలీల్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆలేరు, న్యూస్‌టుడే: భువనగిరిలో మంగళవారం జరిగే 'టీమాస్' ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని 'గోప' అధ్యక్షుడు బి.బాలరాజ్‌గౌడ్ కోరారు. టీమాస్ సభకు గోప పూర్తి మద్దతునిస్తోందని ఆయన చెప్పారు.

ఆలేరులోని 817 సర్వే నెంబరులో ప్రభుత్వ అనుమతులు లేకుండా స్థిరాస్తి వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని భాజపా మండల ప్రధాన కార్యదర్శి పులిపలుపుల మహేష్ సోమవారం ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.

తుర్కపల్లి, న్యూస్‌టుడే : దర్గారం, గొల్లగూడెం గ్రామాలలో చిన్న పిల్లలకు వైద్య సిబ్బంది రుబెల్లా టీకాలు డాక్టర్ చంద్రారెడ్డి అందజేశారు. సర్పంచులు కిష్టయ్య, శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మంగళవారం రుస్తాపూర్, ముల్కలపల్లి, తుర్కపల్లి, కోనాపూర్ గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగలక్ష్మి పేర్కొన్నారు.

స్టాంపుడ్యూటీ బకాయిలను వెంటనే చెల్లించాలని మాదాపూర్, మల్కాపూర్, గంధమల్ల సర్పంచులు దానావత్ హరినాయక్, గోనె ప్రకాష్, వెంకటరెడ్డి జేసీ రవినాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

మోటకొండూరు, న్యూస్‌టుడే: స్థానిక తెరాస నాయకులు నిజాలు తెలుసుకుని మాట్లాడాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వంగపల్లి మహేందర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు ఉప్పలయ్య, కృష్ణ, బాబు, నరేష్ పాల్గొన్నారు.

మోటకొండూరు, న్యూస్‌టుడే: మోటకొండూర్: మండల కేంద్రంలో గణేశ్ నవరాత్రోత్సవాల్లో భాగంగా పంచభూత సేవా సమితి ఆధ్వర్యంలో గ్రామస్థుడు ఉప్పలంచి శంకర్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఇక్కుర్తి: ఇక్కుర్తి గ్రామంలో రెవెన్యూ దస్త్రాలు పరిశీలించి ఏ విధమైన రెవెన్యూ తప్పులు లేని గ్రామంగా ఇక్కుర్తిని తహసీల్దార్ కృష్ణమూర్తి ప్రకటించారు.

చందేపల్లి: టీమాస్ ఫోరం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ సురుపంగ శివలింగం జిల్లా కేంద్రం భువనగిరిలోని ఏఆర్ గార్డెన్ జరిగే టీమాస్ ఫోరం ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని కరపత్రాలు పంచుతూ ప్రచారం చేపట్టారు. జయరాములు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులతో పంట నష్టం

ముందస్తు చర్యలతోనే విముక్తి



పందుల స్వైర విహారంతో నేలకు ఒరిగిన మొక్కజొన్న చేను

తుర్కపల్లి, న్యూస్‌టుడే: ఏటా అడవి పందుల బెడద అధికమవుతూనే ఉంది. మరికొద్ది రోజుల్లో చేతికందాల్సిన పంటలు దక్కకుండా పోతున్నాయి. పందులు మూకుమ్మడిగా పంటలపై దాడులు చేయటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. రాత్రి వేళలో వన్య ప్రాణులు పంటలపై స్వైర విహారం చేస్తుంటే రైతులు దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. వాటిని చంపటం నేరం కాబట్టి అవి రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటేనే అడవి పందుల నుంచి విముక్తి పొందొచ్చని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. ఈ ఏడు ఖరీఫ్ సాగు పనులు ముందస్తుగా ఊపందుకున్నాయి. విత్తుకు బలమైన కార్తులైన రోహిణి, మృగశిరలో వర్షాలు మురిపించటంతో రైతులు ఆరుతడి పంటలు సాగు చేశారు. అన్నదాతల ఆశలపై వరుణుడు కన్నెర్రజేశాడు. సకాలంలో వర్షాలు కురువక సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. మిగిలిన కొద్దిపాటి పంటలను రైతులు కంటికి రెప్పలా చూసుకుంటున్నారు. నియోజకవర్గంలో ఈ ఏడు జొన్న, మొక్కజొన్న, కంది, పెసర, నువ్వులు, సజ్జలు, వేరుశనగ పత్తి సాగు చేశారు. ఆశతో మెట్ట పంటను చూసుకుంటున్నారు. అయితే అన్నదాతల ఆశలను వన్యప్రాణులు నీరుగారుస్తున్నాయి. రాత్రి వేళలో అడవి పందులు, పగటి వేళలో కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. పంటలకు తీవ్ర నష్టం జరుగుతుండటంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్న చేనుపై అడవి పందులు స్వైర విహారం చేస్తున్నాయి. చేను అంతా కలియ తిరగడంతో కర్రలు విరిగి నేలకు ఒరిగి పోతున్నాయి. లేత కంకులు తియ్యగా ఉండటంతో ఇష్టం వచ్చినట్లు విరిచి వేస్తున్నాయి. దీంతో తీవ్రంగా నష్టం పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చేతికందాల్సిన పంటలపై అడవి పందుల దాడి

పగటి పూట కోతుల భారి నుంచి రాత్రి వేళలో అడవి పందుల నుంచి పంటలను కాపాడాల్సిన పరిస్థితి నెలకొంది. పలు ప్రాంతాలలో వేసిన ఇతర పంటలను కూడా నష్టం చేస్తున్నాయి. తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రి, మల్కాపూర్, కొండాపూర్, వీరారెడ్డిపల్లి, వెంకటాపూర్, దత్తాయిపల్లి, వెల్పుపల్లి రాజపేట మండలంలోని కుర్రారం, పారుపల్లి, బేగంపేట, రఘునాథ్‌పూర్,

దిక్కుతోచని స్థితిలో రైతులు

బొందుగుల్ల, చల్లూరు యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపూర్, మాసాయిపేట, బాహుపేట, క్యాసారం, చినకందుకూరు, బొమ్మలరామారం మండలంలోని చీకటిమామిడి, ప్యారారం, జలాల్‌పూర్, మల్యాల, సోలిపేట, మర్యాల, మాసాన్‌పల్లి, ఆలేరు, ఆత్మకూరు, గుండాల మండలాల్లో కూడా వన్య ప్రాణుల బెడద అధికమై పంటలకు నష్టం కలిగిస్తున్నాయి. ఈ ప్రాంతాలలో ఏటా అడవి పందుల బెడదతో రైతులు నష్టపోతున్నారు. నివారణ చర్యలు ఎన్ని తీసుకున్నా ప్రయోజన లేకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవి శాఖ అధికారులు అడవి పందులు పొలాల్లోకి రాకుండా చర్యలు తీసుకుని పంటలను కాపాడాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకుని పంటలను కాపాడుకోవాలి :



ఎన్.దుర్గేశ్వరీ, వ్యవసాయాధికారి

రక్షణ చర్యలు తీసుకుని పంటలను కాపాడుకోవాలి. ఖరీఫ్‌లో సాధారణంగా మెట్ట సాగు విస్తీర్ణం పెరుగుతోంది. అడవి పందులకు మొక్కజొన్న, వేరుశనగ పంటలు చాలా ఇష్టంగా తింటాయి. ఆకలి తీర్చుకునేందుకు అడవి పందులు, కోతులు వచ్చి పంటలను నష్టం చేస్తుంటాయి. ప్రత్యేకంగా కాపలా ఉంటూ రక్షణ చర్యలు తీసుకోవాలి. చేను వద్దకు రాగానే బయపడేలా అక్కడక్కడ కొన్ని తయారు చేసుకున్న ప్రతిమలు ఏర్పాటు చేయాలి. పగటి పూట చేనుకు కాపలా కాసి కోతులను తరిమి కొట్టాలి. రాత్రి వేళలో వచ్చే అడవి పందుల నుంచి పంటను రక్షించుకునేందుకు పంది నూనెలో ముంచిన తాడుని చేను చుట్టూ ఏర్పాటు చేయాలి. నూనె వాసనకు అవి దూరంగా వెళ్తాయి. వన్య ప్రాణులను చంపడం చట్టరీత్య నేరం. రక్షణ చర్యలు మాత్రమే తీసుకోవాలి.



విరిచివేసిన లేత మొక్కజొన్న కంకులు

1న సర్వసభ్య సమావేశం

బొమ్మలరామారం, న్యూస్‌టుడే: మండల సర్వసభ్య సమావేశం సెప్టెంబర్ 1న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కృష్ణారెడ్డి సోమవారం వెల్లడించారు. ఇట్టి సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని సూచించారు.

యాజమాన్యం మొండి వైఖరి వీడాలి

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: ప్రీమియర్ యాజమాన్యం మొండి వైఖరి వీడి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు గుళ్లపల్లి నగేష్ అన్నారు. సమస్యల సాధన కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో మండలంలోని పెద్దకందుకూర్ ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమ కార్మికులు చేపడుతున్న రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం నాటికి 42వ రోజుకు చేరుకున్నాయి. కార్మికులకు డెకేట్ సులు, మెడికల్ ఇన్సూరెన్సు తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కుండె ఆంజనేయులు, పరిపూర్ణచారి, ఆజ్మీరా జయరాం, మాతయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు పట్టాదార్ పాస్‌పుస్తకాలు పంపిణీ

ఆలేరు, న్యూస్‌టుడే: ఆలేరు, ఆత్మకూరు(ఎం), మోటకొండూరు మండలాలకు సంబంధించి సాదా బైనామాలో భాగంగా పూర్తి చేసిన పట్టాదార్ పాస్ పుస్తకాలు, కల్యాణలక్ష్మి పథకంలో లబ్ధిదారులకు మంగళవారం ఆలేరులో జరిగే కార్యక్రమంలో చెక్కులు అందజేస్తామని తహసీల్దార్ మేకల విజయకుమారి చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గొంగిడి సునీత హాజరవుతారని ఆమె చెప్పారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

తుర్కపల్లి, న్యూస్‌టుడే: తుర్కపల్లి మండలంలో ప్రత్యేకంగా నిర్వహిస్తున్న గ్రామ రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. సోమవారం వీరారెడ్డిపల్లి, గంధమల్ల, వేల్పుపల్లి, వెంకటాపూర్ గ్రామాలలో అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. వారసత్వం కింద వచ్చిన భూములను పౌతి అమలు చేశారు. ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. తహసీల్దార్ నాగలక్ష్మి, ఆర్ఐ వెంకటరెడ్డి, వీఆర్వోలు రామలింగం, బాలనర్సయ్య, నరేష్ పాల్గొన్నారు.

రూబెల్లా టీకాల పంపిణీ

కుర్రారం (రాజపేట), న్యూస్‌టుడే: మండలంలోని కుర్రారం పాఠశాలల్లో సోమవారం విద్యార్థులకు మీజిల్స్ రూబెల్లా టీకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి అశ్వినీకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు ఎలాంటి అపోహలకు పోవాల్సిన అవసరం లేదన్నారు. ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర శర్మ, గౌస్ పాషా, హెచ్ఈవో కృష్ణమూర్తి, స్వప్న, భార్గవి, అనిత పాల్గొన్నారు.



అమ్మనబోలులో విద్యార్థులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

మోటకొండూరు: మండల పరిధిలోని అమ్మనబోలు, కాటేపల్లి గ్రామాల్లో మండల వైద్యాధికారి డా.శ్రవణ్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది మీజిల్స్ రూబెల్లా(ఎమ్ఆర్) వ్యాధుల నివారణకు టీకాలను అందజేశారు. పీఎచ్ఎన్ ప్రవీణ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు జ్యోతిరాజ్, సడసంతల మధుసూదన్, రమేష్, శీల స్వరూప, లక్ష్మి, సిద్ధమ్మ పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానం అమలు చేయాలి

బొమ్మలరామారం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులందరికి పాత పింఛన్ విధానం అమలు చేయాలని మండల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకటనర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మట్లాడారు. లోకేందర్‌రెడ్డి, సురేష్, బిక్షపతి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం మంజూరు చేయాలని వినతి

మోటకొండూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఆరెగూడెం గ్రామంలో రేషన్ దుకాణం మంజూరు చేయాలని గ్రామస్థులు సోమవారం తహసీల్దార్ కృష్ణమూర్తికి వినతి పత్రం అందించారు. మండల కేంద్రమైన మోటకొండూరుకు 3కి.మీ.ల దూరంలో ఉండటంతో అక్కడికి వెళ్లి సరుకులు తెచ్చుకోవాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. కార్యక్రమంలో గాజుల మల్లేష్‌గౌడ్, ఎల్లేష్, అశోక్, గణేష్, బాబు, నర్సింహులు, మల్లయ్య పాల్గొన్నారు.

విద్యుత్తు సమాచారం

తుర్కపల్లి న్యూస్‌టుడే: మాదాపూర్, దత్తాయిపల్లి గ్రామాలలో మంగళవారం విద్యుత్తు బిల్లులు వసూలు చేస్తారు. ఏర్పాటు చేసిన ప్రత్యేక బిల్లు కౌంటర్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏఈ సత్యాచారి కోరుతున్నారు.

ఆలేరు

రేపు పీఆర్టీయూ సమావేశం

రాజపేట, న్యూస్‌టుడే: రాజపేటలో పీఆర్టీయూ మండల సర్వసభ్య సమావేశం బుధవారం జరగనున్నట్లు యూనియన్ మండల అధ్యక్షుడు పాకాల క్రిస్టఫర్ సోమవారం తెలిపారు. సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక ఉంటుందని, యూనియన్ బాధ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

టంగుటూరు విద్యార్థులకు ప్రథమ స్థానం



కుంభం అశ్విత

టంగుటూరు(ఆలేరు), న్యూస్‌టుడే: ఆలేరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం భారత ప్రచార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, దేశభక్తి గేయాల పోటీల్లో టంగుటూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. '70 సంవత్సరాల స్వాతంత్ర్య ప్రగతి' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కుంభం అశ్విత, దేశభక్తి గీతాల పోటీలో బండి రేఖ ప్రథమ స్థానంలో నిలిచారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.



బండి రేఖ

టీమాస్ సభను జయప్రదం చేయాలి

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: భువనగిరి పట్టణంలో మంగళవారం జరిగే సామాజిక ప్రజా సంఘాల ఐక్యవేదిక టీమాస్ జిల్లా సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం యాదగిరిగుట్టలో ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సీస శ్రీనివాస్ మాట్లాడుతూ సామాజిక న్యాయం అంశంతో ఏర్పాటు చేయనున్న ఈ సభకు ప్రజాయుద్ధనౌక గద్దర్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, విమలక్క, మేధవులు హాజరు కానున్నరని తెలిపారు. కానుగంటి నర్సింగరావు, మేడ అయిలయ్య, లక్ష్మినారాయణ, వెంకటయ్య, బాలస్వామి, వెంకటేశం, కుశలయ్య, స్వామి పాల్గొన్నారు.

మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు

ఆలేరు, న్యూస్‌టుడే: ఆలేరు మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీలు సెప్టెంబరు 6, 7 తేదీలలో నిర్వహిస్తామని ఎంఈవో బి.లక్ష్మినారాయణ చెప్పారు. ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల నిర్వహణపై సోమవారం ఆలేరు మండల వనరుల కేంద్రంలో మండల పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రీడా పోటీల వేదికను కొల్లూరు జెడ్పీ హైస్కూల్‌ను ఎంపిక చేశామని చెప్పారు. సమావేఅంలో డి.రెడ్డపరెడ్డి, టి.చంద్రశేఖర్, పి.నాగయ్య, ఎం.జోసెప్ పాల్గొన్నారు.

గొర్రెల మృత్యువాత

వంగపల్లి (యాదగిరిగుట్ట పట్టణం), న్యూస్‌టుడే: గొల్ల, కుర్మలను ఆర్థికంగా అభివృద్ధి పర్చేందుకు ప్రభుత్వం గొర్రెల యూనిట్ల పథకం ద్వారా పంపిణీ గొర్రెలలో కొన్ని మృత్యువాత పడుతున్నాయి. సోమవారం మండలంలోని వంగపల్లికి చెందిన గవ్వల అయిలయ్య, బండి మల్లయ్యకు చెందిన గొర్రెలు మూడు మృత్యువాత పడ్డాయి. ఇవి నెల్లూరు నుంచి ఆదివారం మధ్యాహ్నం వంగపల్లికి చేరాయి. అనారోగ్యమా, లేక వాతావరణ పరిస్థితులు అనుకూలించక అని కాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. మిగతా గొర్ల పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆందోళన వ్యక్తం చేశారు.

గణనాథుడికి పూజలు

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వినాయక నవరాత్రోవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం వివిధ ప్రాంతాల్లో వినాయకుడికి ప్రత్యేక పూజలు చేపట్టారు.



గాంధీనగర్‌లో పూజ చేస్తున్న భక్తులు

యువ పథం..!



కాలుష్య నివారణలో భాగంగా సైకిల్ ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ ప్రదర్శన

ఆలేరు, న్యూస్‌టుడే: వారంతా 25 సంవత్సరాల లోపు యువకులే.. వీరిలో కొందరు డిగ్రీ, పీజీలు కోర్సులు చదువుతుండగా.. మరికొందరు ఉపాధికోసం ఏదో ఒక పనిలో నిమగ్నమయ్యారు. పుష్కరకాలం క్రితం పాఠశాల విద్యార్థులుగా ఉన్నప్పుడు సంఘంగా జట్టుకట్టారు. వారి వారి తల్లితండ్రుల సహకారంతో వారు నివసిస్తున్న కాలనీల్లో చిన్నచిన్న సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికీ అదే స్ఫూర్తితో ముందుకు సాగుతూ ఆలేరు పట్టణంలో వివిధ సేవా కార్యక్రమాల నిర్వహణతో పాటు సామాజిక రుగ్మతుల వల్ల కలిగే నష్టాలపై ప్రజలను చైతన్య పరుస్తున్నారు. వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

సేవా కార్యక్రమాల్లో 'యువ యూత్ అసోసియేషన్'

ఆలేరు పట్టణంలోని కాటమయ్యనగర్, చింతల్‌బస్తీకి చెందిన 40మంది స్నేహితులు కలిసి 2004లో 'యువ యూత్ అసోసియేషన్‌ను' స్థాపించారు. నాటి నుంచి నేటివరకు అసోసియేషన్ పరంగా వివిధ రకాల సేవా, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మొక్కల పెంపకం, మూఢనమ్మకాల వల్ల కలిగే అనర్థాలు, ప్రజాస్వామ్యంలో ఓటుకున్న ప్రాధాన్యత, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత, స్వచ్ఛభారత్‌పై ప్రచారం..పట్టణంలోని వివిధ ప్రాంతాలలో స్వతహాగా పారిశుద్ధ్యం చర్యలు చేపట్టడం.. మురుగు కాలువలను శుభ్ర పరచడం, బ్లీచింగ్ పౌడర్, ఫినాయిల్‌ను పిచికారీ చేయించడం, దోమల నివారణకు ఫాగింగ్ లాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆరోగ్య ఆలేరులో భాగస్వాములు అవుతున్నారు.



దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్‌ను చల్లుతూ...

సొంత డబ్బులతోనే..

యువ యూత్ అసోసియేషన్‌లోని సభ్యులు చేపడుతున్న సేవా కార్యక్రమాలకు ఎవరి నుంచి కూడా డబ్బులను ఏరూపంలోనూ ఆశించరు.. తలాకొంత నగదును పోగుచేసి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుండడంతో పట్టణ ప్రజల నుంచి నీరాజనాలు అందుకుంటున్నారు. అసోసియేషన్ సభ్యులు సైనిక క్రమశిక్షణను పాటిస్తారు. ఎలాంటి ఇతర వ్యాపకాలు, చెడు వ్యసనాల జోలికి వెళ్లరు. అందరూ ఒకేమాటకు కట్టుబడి ఉంటారు.



ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తూ....

మావంతు బాధ్యతగా..:



కట్కం సిద్దేశ్వర్

పాఠశాలలో చదువుతున్నపుడే ప్రజలకు ఏదో ఒకటి చేయాలని అనుకున్నాం. ఇందులో భాగంగానే వివిధ రకాల సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. ఆలేరు ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో ముందుకు సాగుతున్నాం. రానున్న రోజుల్లోనూ సేవ కార్యక్రమాలను నిర్వహిస్తాం.

ప్రజలను చైతన్య పరుస్తున్నాం.:



బొల్లారం రమేష్

యువ యూత్ పరంగా స్థానిక ప్రజలను కొంతమేరకైనా చైతన్య పరుస్తున్నాం. వ్యక్తి గత పరిరక్షణ పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తూ కొత్తవారిని ఓటరుగా నమోదు చేయించినపుడు చాలా ఆనందం కలిగింది. స్వయంగా మురుగు కాలువల్లో పలుమార్లు బ్లీచింగ్ పౌడర్‌ను చల్లాం.

సేవా కార్యక్రమాలు విస్తృతం: గనగాని శశికాంత్



యువ యూత్ అసోసియేషన్ పరంగా స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను మరింత విస్తృత పరుస్తాం. అసోసియేషన్‌లో ఉన్న వారంతా యువకులే. వీరంతా కూడా ఉత్సాహంగా పనిచేస్తున్నారు. యువ యూత్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలను చూసి పలువురు అధికారులు అభినందించారు. ఈ స్ఫూర్తితో మరింతగా సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తాం.

విద్యాప్రమాణాల పెంపునకు కృషి

రాజపేట : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాల పెంపునకు ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపడుతోందని ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. సోమవారం 'భారత సేవాశ్రమ సంఘం' ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. గురుకుల వ్యవస్థ, కేజీ నుంచి పీజీ, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం కార్యక్రమాలు అందులో భాగమేనన్నారు. సమాజశ్రేయస్సుకు జీవితాన్ని అంకితం చేసిన సేవాశ్రమ నిర్వాహకులు మునీశ్వరానంద స్వామి సేవానిరతిని అభినందించారు. ప్రొఫెసర్ ప్రణబ్, బట్టాచార్యలు మాట్లాడుతూ రానున్న రోజుల్లో పాఠశాల వసతుల కల్పనకు పూనుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యుడు ఎన్.రాజిరెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు కాలె సుమలత, తహసీల్దారు రామమూర్తి, ఎంఈవో జంగిటి కృష్ణ, సర్పంచి వి.భాగ్యలక్ష్మి, కృష్ణ, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పాల్గొన్నారు.



విద్యార్థులకు రాతపుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గొంగిడి సునీత

యాదగిరిగుట్ట పట్టణం : వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ, సమస్యలపై వెంటనే స్పందించాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత సూచించారు. సోమవారం యాదగిరిగుట్టలో నియోజకవర్గంలోని మండల వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతు సమగ్ర సర్వే ఎంతమేర జరిగిందో, ఉచిత ఎరువుల పథకంపై ఏలాంటి సర్వే చేపడుతున్నారో తెలుసుకున్నారు. రైతులకు రుణాలు ఇవ్వకుండా బ్యాంకులు ఇబ్బందులు కలిగిస్తే మేనేజర్లతో మాట్లాడాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి హరినాథ్‌బాబు, ఏడీఏలు సంధ్యారాణి, వెంకటేశ్వర్‌రావు, మండలాల ఏవో, ఏఏవోలు తదితరులు పాల్గొన్నారు.

రాజపేట : నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. రాజపేటలోని ఆర్యవైశ్యుల శ్మశానవాటికకు వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని ఆ సంఘం నాయకులు సోమవారం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. స్నానవాటికలతోపాటు ప్రహరీ వసతులు కల్పించాలని కోరారు. విద్యావ్యవస్థకు అనుబంధంగా వ్యవహరిస్తున్న ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, సీఆర్పీలను క్రమబద్ధీకరించి కోరుతూ వినతిపత్రం అందించారు. అనంతరం స్థానిక మీనాక్షి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన పార్టీ కార్యకర్తల సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో మండలపార్టీ అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, సుమలత, వెంకటేశ్, రామాదేవి, వి.అశోక్‌గౌడ్, రాజ, కృష్ణ, ప్రభాకర్, జగదీశ్, శేఖర్ పాల్గొన్నారు.

31న మండల సర్వసభ్య సమావేశం

రాజపేట, న్యూస్‌టుడే: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 31న జరగనున్నట్లు ఎంపీడీవో రేవతమ్మ తెలిపారు. సమావేశానికి ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యుడు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

ట్రాఫిక్ ఆంక్షలు సరి కాదు

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట పట్టణం అభివృద్ధికి నోచుకోకముందే, నిబంధనలు, వెసులుబాటు, సూచికలు కల్పించకముందే ట్రాఫిక్ ఆంక్షలు విధించడం సరైంది కాదని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుండ్లపల్లి నర్సింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం యాదగిరిగుట్టలో ట్రాఫిక్ నియంత్రణపై పోలీసులు వ్యవహరిస్తున్న తీరు, అడ్డగోలుగా పన్నులు దండుతున్న తీరుపై స్థానిక నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ పోలీసులతో వాదోపవాదాలకు దిగారు. అనంతరం నర్సింహ విలేకర్లతో మాట్లాడుతూ పట్టణంలో రహదారి సరిగా లేదని, పుట్‌పాత్ నిర్మాణం కానీ, వాహనాలు నిలిపే ప్రదేశం కానీ నిర్మాణం చేయలేదని, ఎక్కడా వెసులుబాటు కల్పించకుండా ట్రాఫిక్ పోలీసులు అడ్డగోలుగా చలాన్లు రాస్తూ, అవగాహన లేని గ్రామీణ ప్రాంత ప్రజల వద్ద దోచుకోవడం సరికాదన్నారు. అనంతరం ట్రాఫిక్ ఎస్సై నాగేశ్వరరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. కాదూరి అచ్చయ్య, బొజ్జ సాంబేష్, సౌండ్ సత్యం, నాగరాజు, బాలరాజు, వంశీ, మల్లేశ్ పాల్గొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ ఆరాధనలు



కల్యాణమూర్తులుగా శ్రీ లక్ష్మీనరసింహుడు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో సోమవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. హరి, హరులను ఆరాధిస్తూ ఆలయాల్లో ఆయా సంప్రదాయాలతో పూజారులు నిత్యారాధనలు, ప్రత్యేక అర్చనలు చేపట్టారు. బాలాలయంలో శ్రీ లక్ష్మీనరసింహులను ఆరాధిస్తూ వైష్ణవ ఆచారంగా నిజాభిషేకం, అర్చనలు నిర్వహించారు. కవచమూర్తులను స్వర్ణ పుష్పాలతో అర్చించారు. మహామండపంలో శ్రీ లక్ష్మీనరసింహుల నిత్యకల్యాణం నిర్వహించారు. పాంచరాత్ర ఆగమశాస్త్రీయంగా చేపట్టిన కల్యాణపర్వంలో ఉత్సవ మూర్తులను అలంకరించి గజవాహనోత్సవాన్ని నిర్వహించారు. సహస్రనామాలతో ఆరాధిస్తూ అష్టోత్తరం కొనసాగింది. సాయంత్రంవేళ అలంకార జోడు సేవోత్సవాలను నిర్వహించారు.

▲ కొండపైనే అనుబంధంగా కొనసాగుతున్న చరమూర్తుల ఆలయంలో రామలింగేశ్వరుడిని ఆరాధిస్తూ అభిషేకం, అర్చన నిర్వహించారు. మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, బిల్వార్చనలు నిర్వహించారు. పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని నిర్వహించిన పూజారులు సేవోత్సవాన్ని నిర్వహించారు.

యాదాద్రిలో నేడు

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి బాలాలయంలో మంగళవారం వేకువజామున 4 గంటలకు సుప్రభాతం, 4:30కు బిందెతీర్థం, ఆరాధన, 5 గంటలకు బాలబోగము, 5:30కు సర్వదర్శనములు, 6:30కు అష్టోత్తర శతఘటాభిషేకం, 7:30కు నిజాభిషేకం, 8 గంటలకు సహస్రనామార్చన, 8:30కు సుదర్శన నారసింహ హోమం, అనంతరం దర్శనాలు, 9:30కు పుష్కరిణి చెంతగల ఆంజనేయస్వామికి ఆకుపూజ, 10:30కు బాలాలయంలో శ్రీ లక్ష్మీనరసింహుల నిత్యకల్యాణం, మధ్యాహ్నం 12:30కు నివేదన, అనంతరం దర్శనాలు, సాయంత్రం 6 గంటలకు జోడు సేవోత్సవం, రాత్రి 7:20కు ఆరాధన, 7:30కు అర్చన, 9 గంటలకు ఆరగింపు, 9:45కు శయనోత్సవం, ద్వారబంధనం. శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలు ఉదయం 8, 10 గంటలకు, మధ్యాహ్నం 12 గంటలకు, సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తారు.

పాతగుట్టలో..

యాదాద్రి దేవస్థానానికి అనుబంధంగా గల పాతగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం 5 గంటలకు సుప్రభాతం, 5:30కు ఆరాధన, బిందెతీర్థం, 6:15కు బాలబోగము, 6:45కు దర్శనాలు, 8 గంటలకు నిజాభిషేకం, 8:30కు సహస్ర నామార్చన, 9 గంటలకు దర్శనాలు, 10:30కు శ్రీ లక్ష్మీనరసింహుల నిత్య కల్యాణం, మధ్యాహ్నం 12 గంటలకు రాజభోగము, 12:30కు దర్శనాలు, మధ్యాహ్నం ఒంటిగంటకు ద్వారబంధనం, 2 గంటల నుంచి ప్రత్యేక దర్శనాలు, 3 గంటలకు ఉభయ దర్శనాలు, సాయంత్రం 5:30కు అలంకార సేవోత్సవం, 6:45కు ఆరాధన, సహస్ర నామార్చన, 7:30కు నివేదన, 8 గంటలకు ద్వార బంధనం.

నిత్యరాబడి

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ఖజానాలో సోమవారం వివిధ విభాగాల ద్వారా రూ. 7,52,730 నిత్యరాబడి పద్దు కింద జమయ్యాయని దేవస్థానం ఈవో ఎన్.గీత తెలిపారు. ఈ రాబడిలో ప్రధాన పూజలతో రూ. 60,310, ప్రత్యేక దర్శనాలతో రూ. 1,04,600, వ్రతాలతో రూ. 50,500, కల్యాణకట్టతో రూ. 24,000, అద్దె గదులతో రూ. 50,150, శాశ్వత పూజలు రూ. 12,616, అన్నప్రసాదం రూ. 7,697, ప్రసాదాల విక్రయం ద్వారా రూ. 3,43,920 మిగతావి వివిధ విభాగాల చేకూరాయని ఈవో వివరించారు.

శ్రీస్వామికి రికార్డు స్థాయిలో..
హుండీ రాబడి

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రీశుడిని శ్రీ లక్ష్మీదేవి వరించిందేమో. ఇటీవల ముగిసిన శ్రావణ మాసంలో రూ. 6కోట్లకు పైగా ఆదాయం చేకూరగా హుండీ ద్వారా రూ. 1,00,93,202 లభించడం విశేషం. ఇంత పెద్దమొత్తంలో హుండీ ద్వారా ఆదాయం చేకూరడం బాలాలయంలో ఇదే మొదటి సారి. కేవలం 27రోజుల్లో ఆ పెద్ద మొత్తంలో నగదు రావడం రికార్డని ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన ఆలయం పునర్నిర్మాణం కారణంగా బాలాలయం నిర్మించి ఏడాదిన్నర కావొస్తోంది. బాలాలయంలో గత మే నెలలో హుండీ ద్వారా రూ. 86 లక్షలు రాగా ఈసారి రూ. కోటి దాటడం విశేషమని దేవస్థానం ఈవో గీత అన్నారు.

❑ శ్రీ లక్ష్మీనరసింహస్వామి బాలాలయాన్ని సందర్శించిన పలు ప్రాంతాలకు చెందిన భక్తులు హుండీలలో సమర్పించిన నగదు, నగల, కానుకలను సోమవారం లెక్కించారు. ఆలయ ఈవో ఎన్.గీత, ధర్మకర్త నరసింహమూర్తి, దేవాదాయశాఖ అధికారి లక్ష్మి సమక్షంలో ఆలయోద్యోగులు హుండీ నగదుతోపాటు నగలను లెక్కించారు. ఈ లెక్కింపులో నగదు రూ. 1,00,93,202 చేకూరగా బంగారం 98 గ్రాములు, వెండి 5 కిలోల 30 గ్రాములు లభించినట్లు ఈవో పేర్కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం ఆలయ మహామండపంలో కొనసాగిన లెక్కింపులో పేష్కార్ భాస్కర్‌శర్మ, ఏఈవోలు చంద్రశేఖర్, రామ్మోహన్‌తోపాటు పర్యవేక్షకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పర్వతారోహణతో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలి



శిక్షణకు హాజరైన విద్యార్థులు

భువనగిరి ఖిల్లా, న్యూస్‌టుడే: పర్వతారోహణతో విద్యార్థులు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలంగాణ మైనార్టీ ఆశ్రమ పాఠశాలల క్రీడాధికారి సోమేశ్వర్ అన్నారు. సోమవారం భువనగిరి ఖిల్లా వద్ద బాలుర ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణలోని ఏడు జిల్లాలకు చెందిన 60 మంది మైనార్టీ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు శిక్షణ పొందుతున్నట్లు చెప్పారు. ఈ శిక్షణలో ప్రతిభ చూపిన వారిని కిలిమంజారో పర్వతారోహణకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. మొదటి రోజున పర్వతారోహణపై ప్రాథమిక శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ భిక్షపతి, రాజేందర్ గౌడ్, చాంద్‌పాష పాల్గొన్నారు.

ధర్మారెడ్డి కాల్వను పరిశీలించిన డీఈ

రామన్నపేట, న్యూస్‌టుడే: ధర్మారెడ్డి కాల్వను నీటి పారుదల శాఖ డీఈ శ్రీధర్‌రావు సోమవారం పరిశీలించారు. పలుచోట్ల కాల్వ స్థితిగతులను పరిశీలించారు. నీటి సరఫరా జరుగక పోవడానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండల తెరాస నాయకులు డీఈతో మాట్లాడుతూ కాల్వకు అవసరం ఉన్నచోట్ల వెంటనే మరమ్మతులు చేసి నీటి సరఫరా చేయాలన్నారు. మండలంలోని చెరువులను నింపాలని కోరారు. కార్యక్రమంలో తెరాస నాయకులు గంగల రాజిరెడ్డి, జినుకల ప్రభాకర్, కక్కిరేణి విజయ్‌కుమార్, బత్తుల క్రిష్ణాగౌడ్, రామిని రమేశ్, ఎండీ.నాసర్, గుత్తా నర్సిరెడ్డి, ఎండీ.అక్రం, కాంగ్రెస్ నాయకుడు మీర్జా బషీర్‌బేగ్ పాల్గొన్నారు.

అది 'షా' పనే!

(మొదటి పేజీ తరువాయి) హైదరాబాద్‌లోని సీసీఎస్, ఎస్‌వోటీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బొర్రోళ్లగూడెం వద్దే సరకు మాయం

జాతీయ రహదారి పక్కనే ఉన్న దండుమల్కాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని బొర్రోళ్లగూడెం బస్‌బే వద్దనే దుండగలు సిగరెట్ల అట్టపెట్టెలను మాయం చేసినట్టు పోలీసులు గుర్తించారు. కంటైనరులోని 645 సిగరెట్ల కార్టన్లు(అట్టపెట్టలు) కేవలం 50 నిమిషాల్లోనే మరో వాహనంలోకి మార్చినట్లు దోపిడీకి గురైన కంటైనరుకు ఉన్న జీపీఎస్ సౌకర్యం ద్వారా పోలీసులు నిర్ధరించారు. ఎవరైనా అడిగినా కంటైనర్ మరమ్మతుకు గురికావడంతో మరో లారీలోకి మారుస్తున్నామని చెప్పవచ్చనే ధైర్యంతోనే జాతీయ రహదారి పక్కనే పనిని ముగించారు. ఇన్ని అట్టపెట్టలను తక్కువ సమయంలోనే మరో వాహనంలోకి మార్చారంటే దుండగలు సుమారు 25 నుంచి 30 మంది వరకు ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఎక్కువ మంది రావడం, సిగరెట్లను మార్చేందుకు వెంట మరో లారీని తెచ్చుకోవడం చూస్తే దుండగులు పక్కా ప్రణాళికతో దోపిడీ చేసినట్టు చెబుతున్నారు.

సిగ్నల్స్ ఆధారంగా దర్యాప్తు..

కంటైనరు బయలుదేరే సమయం నుంచి దోపిడీ పూర్తయ్యే వరకు ఆ ప్రదేశంలో పనిచేసిన చరవాణి నంబర్లను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఎక్కువగా ఏ నంబర్లు పని చేశాయి?, వాటి నుంచి ఏఏ నంబర్లకు కాల్స్ వెళ్లాయి? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మొత్తానికి కాస్త ఆలస్యమైనా కేసును తప్పకుండా ఛేదిస్తామనే ధీమాలో పోలీసులు ఉన్నారు. రాచకొండ సంయుక్త సీపీ తరుణ్ జోషి ఆధ్వర్యంలో ఎస్‌వోటీ, సీసీఎస్, లాఅండ్‌ఆర్డర్ పోలీసులు బృందాలుగా విడిపోయి దర్యాప్తు చేస్తున్నారు.

పాత కేసులను తిరగేస్తున్నారు..

గతంలో ఇలా సిగరెట్ల వాహనాలను దోపిడీ చేసిన ముఠాల గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. 2015లో ఇదే తరహాలో దోపిడీ చేసిన అలీషా గ్యాంగ్‌ను హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. అప్పట్లో మహారాష్ట్రలోని పుణే సమీపంలోని ఇంద్రాపూర్ వద్ద సుమారు రూ.3.28కోట్ల విలువైన సిగరెట్ల లారీని ఈ గ్యాంగ్ ఇలాగే హైజాక్ చేసి దోపిడీ చేసింది. షోలాపూర్ రంజన్‌గావ్‌లోని ఐటీసీ ఫ్యాక్టరీ నుంచి బయలుదేరిన లారీని ఇంద్రాపూర్ వద్ద అడ్డగించిన ముఠా.. హుమ్నాబాద్‌కు తరలించి సిగరెట్లను ఓ వ్యక్తి ఇంట్లో దాచింది. ఆ కేసు దర్యాప్తులో ఉండగానే లారీని పటాన్‌చెరు వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఇప్పుడు కూడా షా ముఠా కార్యకలాపాలపై రాచకొండ పోలీసులు ఆరా తీస్తున్నారు. గత ఏడాది విశాఖపట్నంలో రూ.6 కోట్ల విలువైన సిగరెట్ల లారీ, విజయవాడ ఇబ్రహీంపట్నం సమీపంలో రూ.2కోట్ల విలువైన సిగరెట్ల దోపిడీ యత్నం కేసులనూ పరిశీలిస్తున్నారు.

'పేట'కు మాతా శిశు సంరక్షణ కేంద్రం

అదనంగా మరో 50 పడకలపై కొరవడిన స్పష్టత



సూర్యాపేట ప్రాంతీయ ఆసుపత్రిలోని శిశువిభాగాన్ని పరిశీలిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి (పాతచిత్రం)

సూర్యాపేట(తాళ్లగడ్డ), న్యూస్‌టుడే: సూర్యాపేటకు మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని(ఎంసీహెచ్) మంజూరు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా ఐదు ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. అందులో భాగంగా సూర్యాపేటకు ఎంసీహెచ్ (మథర్ అండ్ ఛైల్డ్ హెల్త్ సెంటర్) విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా రూ.35కోట్ల వ్యయంతో అచ్చంపేట, మంథని, సూర్యాపేట, ఏటూరునాగారం, కామారెడ్డిల్లో ఒక్కో చోట 50 పడకలతో ఈ కేంద్రాల్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఆయా ప్రాంతాల్లో గర్భిణీ, బాలెంతలు, అప్పుడే జన్మించిన శిశువులకు ప్రత్యేక వైద్యసేవలు అందనున్నాయి. వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వీటి కోసం ప్రత్యేక భవనాలను నిర్మించనున్నారు. ఇటీవల కేసీఆర్ కిట్ ప్రభావంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగిన విషయం తెలిసిందే. దీంతో ఇప్పటికే 100 పడకల సూర్యాపేట ప్రాంతీయ వైద్యశాలలో పడకల కొరతతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ప్రాంతీయ వైద్యశాలను పరిశీలించిన మంత్రి జగదీష్‌రెడ్డి సూర్యాపేట ప్రాంతీయ వైద్యశాలకు అదనంగా మరో మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని మంజూరు చేయిస్తానని హామీనిచ్చారు. సోమవారం నాటి ఉత్తర్వుల్లో 50 పడకల ఎంసీహెచ్ మాత్రమే మంజూరైనట్లు తెలిసింది. మరో యాభై పడకల ఎంసీహెచ్‌పై స్పష్టత రావల్సి ఉంది. ఈ కేంద్ర నిర్మాణం పూర్తయితే చిన్నారులకు ప్రత్యేక ఇంక్యుబిలేటర్లు, ప్రసూతి వైద్యులు అందుబాటులోకి రానున్నారు. దీంతో గర్భిణులకు, అప్పుడే జన్మించిన శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి. ప్రత్యేక ప్రసూతి, చిన్నపిల్లల, మత్తు వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉంటారు. అలాగే ప్రస్తుత ప్రాంతీయ వైద్యశాల వైద్యులపై పని ఒత్తిడి తగ్గి సాధారణ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి.

నెలరోజుల్లో కేంద్రాన్ని ప్రారంభిస్తాం

డాక్టర్ సంపత్‌కుమార్, డీసీహెచ్ఎస్, సూర్యాపేట జిల్లా

ఎంసీహెచ్ కేంద్రం ఏర్పాటుకు అనువైన తాత్కాలిక అద్దె భవనం కోసం ప్రయత్నిస్తున్నాం. అనుకూలమైన భవనం లభిస్తే నెల రోజుల్లో సూర్యాపేటలో మాతా శిశు సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తాం. శాశ్వత భవనం కోసం ప్రాంతీయ వైద్యశాల వెనుక భాగంలో ఉన్న శవాగారాన్ని తొలగించి, అదే ప్రాంతంలో నిర్మించాలని ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయి. మంత్రి జగదీష్‌రెడ్డి కృషితోనే ఇక్కడ ఎంసీహెచ్ మంజూరైంది. మరో 50 పడకల కోసం మంత్రి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఏడాదిన్నరలో శాశ్వత భవన నిర్మాణం పూర్తి చేసే అవకాశాలు ఉన్నాయి.

బాపూజీ జయంతి నాటికి వంద బహిరంగ మలవిసర్జన గ్రామాలు

భువనగిరి, న్యూస్‌టుడే: గాంధీ జయంతి అక్టోబర్ 2 నాటికి జిల్లాలో వంద గ్రామాలు బహిరంగ మలవిసర్జన రహితమైనవిగా చేయాలని పాలనాధికారి అనితారామచంద్రన్ సూచించారు. సోమవారం తన ఛాంబర్‌లో జిల్లా అధికారులు, మండల సమన్వయ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓడీఎఫ్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఎంపిక చేసుకున్న గ్రామాల్లో ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి నిర్మించేలా మండల సమన్వయ అధికారులు దృష్టి పెట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బందిని ఎప్పటికపుడు అప్రమత్తం చేస్తూ ప్రజాచైతన్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే రాష్ట్రస్థాయిలో ముందంజలో ఉంటామన్నారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన లక్ష్యాలను నెలవారీగా నిర్దేశించుకుని పూర్తిచేయాలని అప్పుడే జిల్లా సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. హరితహారం లక్ష్యాలను నెరవేర్చడంలో పలు శాఖలు వెనుకంజలో ఉన్నాయంటూ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజావాణి వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించమన్నారు. చౌటుప్పల్ మండలానికి జిల్లా రూబన్ మిషన్ కింద అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.15 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. వీటితో అర్ధంతరంగా నిలిచిపోయిన విద్య, వైద్యశాఖల్లోని పనులు చేపట్టడంతోపాటు ఇతర పనులపై గ్రామస్థాయిలో సర్వే చేయాలని అధికారులకు సూచించారు. ప్రజావాణిలో 46 వినతులు స్వీకరించారు. సమావేశంలో జేసీ రవి గుగ్లోత్, డీఆర్‌వో మహేందర్‌రెడ్డి, డీఆర్‌డీవో వెంకట్రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

భువనగిరి ఆబాది, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన ప్రజావాణిలో సోమవారం అర్జీదారుల నుంచి వినతులు వెల్లువలా వచ్చాయి. ఆర్జీదారులు తమ గోడును కలెక్టర్ అనితారామచంద్రన్‌కు విన్నవించుకున్నారు. వ్యక్తిగత సమస్యలు, కార్మికుల సమస్యలు, ప్రభుత్వ నిదుల దుర్వినియోగం, వితంతు పింఛన్లు, భూవివాదాలు, రుణాలు, ఉద్యోగ అవకాశాలు, కల్పించాలని కోరుతూ వినతులు సమర్పించారు. డీఆర్వో మహేందర్‌రెడ్డి, డీఈఆర్‌డీవో వెంకట్రావ్, జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సమస్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ అనితారామచంద్రన్ బాధితులకు హామీ ఇచ్చారు.



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అనితారామచంద్రన్

ఆదాయం నేలచూపులు

(మొదటి పేజీ తరువాయి) తోడయ్యాయి. భవిష్యత్తులో ఆదాయం పెరుగుతుందని ఆశిస్తున్నాం. **– వాసుదేవరావు, జిల్లా రిజిస్ట్రార్, ఉమ్మడి నల్గొండ జిల్లా**

గణాంకాలు (ఆదాయం. రూ. లక్షల్లో)

సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం	గత ఏడాది ఆదాయం (ఏప్రిల్ నుంచి జులై వరకు)	ఈ ఏడాది ఆదాయం (ఏప్రిల్ నుంచి జులై వరకు)
1. భువనగిరి	817.02	631.35
2. బీబీనగర్	519.19	450.65
3. చండూర్	144.87	119.53
4. చౌటుప్పల్	471.85	309.21
5. దేవరకొండ	521.8	545.43
6. హుజూర్‌నగర్	291.12	284.1
7. కోదాడ	570.51	527.46
8. మిర్యాలగూడ	425.09	368.83
9. మోత్కూరు	179.81	90.83
10. నకిరేకల్	250.76	225.14
11. నల్గొండ	836.96	745.9
12. నిడమనూరు	95.56	201.9
13. రామన్నపేట	166.97	272.28
14. సూర్యాపేట	653.69	852.81
15. యాదగిరిగుట్ట	1039.83	795.9
మొత్తం	6985.03	6421.32



640.2 అడుగులకు చేరిన మూసీప్రాజెక్టు నీటిమట్టం

నిండుకుండలా మూసీ జలాశయం

కేతేపల్లి, న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతాల్లో భారీవర్షాలు కురుస్తుండటంతో జిల్లాలోని మూసీ ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుతుతోంది. సోమవారం సాయంత్రానికి మూసీ జలాశయం నీటిమట్టం 640.2 అడుగులకు చేరుకుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు. ఎగువ ప్రాంతం నుంచి 2600 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.4 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.2 టీఎంసీల నీరు చేరిందని ప్రాజెక్టు ఇంజినీరు ఎన్.రమేష్ తెలిపారు. నీటిమట్టం రోజురోజుకు పెరుగుతుండటంతో సోమవారం ప్రాజెక్టు డీఈఈ నవికాంత్ జలాశయాన్ని పరిశీలించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని మదరసాల నాజీమ్‌లు 2017-18 సంవత్సరానికి జిల్లా విద్యాశాఖాధికారి, ఎక్స్‌అఫీషియో ప్రాజెక్టు అధికారి, సర్వశిక్షా అభియాన్ నల్గొండ కార్యాలయం నుంచి సహకారం పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో ఏలే చంద్రమోహన్ తెలిపారు. మదరసాలను మొదట ప్రత్యేక శిక్షణ కేంద్రాలుగా పరిగణిస్తామని చెప్పారు. తరువాత పిల్లల వివరాలను సమీపంలో ఉన్న పాఠశాలలో నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రత్యేక శిక్షణ కేంద్రాలు(మదరసాలు)ను సమీప పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షిస్తారని వివరించారు. ఆసక్తి ఉన్న మదరసాల నిర్వాహకులు సెప్టెంబర్ 7 లోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

విధుల నుంచి తొలగింపు

నిడమనూరు,న్యూస్‌టుడే: మండల పరిధిలోని ముప్పారం గ్రామ పంచాయతికి చెందిన సోమవారిగూడెం లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కస్తూరి నందికేశ్వర్ (57)ను విధుల నుంచి తొలగించారని సోమవారం నిడమనూరు మండల విద్యాధికారి లావురి బాలునాయక్ వెల్లడించారు. ఈయన వివిధ రాష్ట్రాల యునివర్సిటీ, పదో తరగతి, ఇంటర్ బోర్డు, కాలేజీలకి సంబందించిన నకిలీ ధ్రువపత్రాల తయారీ ముఠాలో నిందితుడని, ఈ ముఠాను ఈ నెల 14న సికింద్రాబాద్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. శనివారం నల్గొండ డీఈవో చంద్రమోహన్ అయనను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని ఎంఈవో వెల్లడించారు.

360°ల్లో నిఘా

(మొదటి పేజీ తరువాయి) ఏర్పాటు చేయగా సోమవారం నుంచే నిమజ్జనం ప్రారంభమైంది. సెప్టెంబర్ 3న 90శాతం విగ్రహాల నిమజ్జనం జరుగుతుందన్నారు.

జిల్లావ్యాప్తంగా మిగిలిన విగ్రహాలను వచ్చేనెల 3న నిమజ్జనం చేయనున్నారని తెలిపారు. ఇందు కోసం ముగ్గురు డీసీపీలు, 388 మంది కానిస్టేబుళ్లు, 60 మంది ఏఆర్, 29 మంది ట్రాఫిక్ సిబ్బంది, 38 మంది హోంగార్డులు విధుల్లో పాల్గొంటారన్నారు. పరిస్థితిని సీఐ, ఎస్‌ఐలు ఎప్పటికపుడు పర్యవేక్షిస్తారని తెలిపారు. అదనంగా సాయుధ పోలీసు బలగాలను పంపాలని కోరామన్నారు. ఎన్‌సీసీ కేడెట్లను కూడా బందోబస్తుకు ఉపయోగించుకుంటామన్నారు.

భువనగిరి, చౌటుప్పల్ సబ్‌డివిజన్‌లలో రెండు బాంబ్‌స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేపడతాయని, 20 బ్లూకోల్ట్స్, 20 గస్తీ వాహనాలు నిమజ్జనాన్ని పర్యవేక్షిస్తాయన్నారు. అదనంగా గస్తీ వాహనాలను పంపాలని నివేదించామన్నారు. ఈసారి రెండు ప్రత్యేక వాహనాలపై 360 డిగ్రీలు చుట్టూ తిరిగే మౌంటెడ్ కెమెరాలతో నిమజ్జన యాత్రను పర్యవేక్షిస్తామన్నారు.

భువనగిరి పట్టణంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామని ఇద్దరు సీఐలు, ఆరుగురు ఎస్ఐలు, 60 మంది సిబ్బందితోపాటు గస్తీ వాహనాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రైవేట్ కెమెరామెన్లను ఏర్పాటుచేసి నిమజ్జన యాత్రను చిత్రీకరిస్తూ అసాంఘిక శక్తులపై దృష్టి కేంద్రీకరిస్తామన్నారు. అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోనూ వీడియో చిత్రీకరణ ఉంటుందన్నారు. నిమజ్జనం జరిగే భువనగిరి, బీబీనగర్, రాఘవాపూర్, చౌటుప్పల్ చెరువులు, భీమలింగం కత్వా వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా భువనగిరి పట్టణంతోపాటు పలు ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు



శ్రీనివాసరావు తయారు చేస్తున్న పంచగవ్య కషాయం

సేంద్రియ వ్యవసాయంలో మంచి ఫలితాలను సాధిస్తున్న ప్రాంతాల్లో మేళ్లచెరువు మండలంలోని రామాపురం, ఎర్రగట్టు తండా గ్రామాలను ప్రధానంగా చెప్పుకోవచ్చు. ఈ రెండు గ్రామాలకు చెందిన రైతులు కొందరు సేంద్రియ విధానంపై పట్టు సాధించారు. వరితో పాటు కూరగాయలను పండిస్తున్నారు. ఎలాంటి రసాయన మందుల అవశేషాలు లేని నాణ్యమైన పంట ఉత్పత్తులను మార్కెట్ చేస్తున్నారు. తద్వారా ఆర్థిక పురోగతికి బాటలు వేసుకుంటున్నారు. దాదాపు పదేళ్ల క్రితం మండల వ్యవసాయాధికారిగా పనిచేసిన శ్యాంసుందర్‌రెడ్డి వీరికి దారి చూపారు. ఎన్పీఎంలో సీఏగా పనిచేసిన రామాపురానికి చెందిన మైలా శ్రీనివాసరావు అదే బాటను అనుసరిస్తూ ఎర్రగట్టుతండాకు చెందిన బేత వెంకటరెడ్డి అనే రైతు ద్వారా మరో పది మంది రైతులను తమ బాటలో నడిపిస్తున్నారు. ఇలా ఒకరికి ఒకరు తోడై.. పది మందితో కూటమై.. ఆర్థిక ప్రగతికి పునాదులు వేసుకుంటున్నారు. మిగతా రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. - మేళ్లచెరువు, న్యూస్‌టుడే

ఒకరికొకరు తోడై..

పదిమందితో కూటమై..

సేంద్రియ వ్యవసాయంలో స్ఫూర్తిగా నిలుస్తున్న రైతులు

కూరగాయల సాగులోనూ ఇదే విధానం అమలు



రామాపురం తోటలో కాసిన బీర, దోస కాయలు



ఎర్రగట్టుతండాలో సేంద్రియ విధానంలో సాగు చేస్తున్న వరి పొలం

సొంతంగా తయారీ

మైలా శ్రీనివాసరావుతో పాటు ఎర్రగట్టుతండా రైతులంతా వేప, నిమ్మ, పంచగవ్య కషాయాలను సొంతంగా తయారు చేసుకుంటున్నారు. ఎలాంటి తెగులు వచ్చినా.. సొంతంగానే తెగులును కనిపెట్టగల సామర్థ్యాన్ని పొందారు. ఆవు పంచకాన్ని శ్రద్ధతో పట్టుకుంటున్నారు. ఒక రకంగా చెప్పాలంటే.. వారు రసాయన ఎరువులను మర్చిపోయారని వ్యవసాయాధికారులూ చెబుతుండటం గమనార్హం.



మార్కెట్ చేస్తున్నా..: వెంకటరెడ్డి, రైతు, ఎర్రగట్టుతండా

నేను ఆరెకరాల్లో సేంద్రియ వ్యవసాయం చేస్తాను. దాదాపు పదేళ్ల నుంచి నాతో పాటు మా ఊరి వాళ్లు పదిమంది ఇలాగే వరిపంట పండిస్తున్నారు. దిగుబడులు సాధారణం కంటే అటు ఇటుగా వస్తున్నా.. పంట దిగుబడుల్లో నాణ్యత ఉంటుంది. ఏటా దిగుబడులు పెరుగుతుంటాయి. అందుకే రైతు కుటుంబాల వాళ్ల ఈ బియ్యాన్నే తింటున్నాం. ఎవరికైనా కావాలంటే విక్రయిస్తున్నాం. మార్కెట్ కూడా చేస్తున్నాను. పంచగవ్య, ఇతర కషాయాలను మేమే తయారుచేసుకుటున్నాం.



ఎనిమిదేళ్ల నుంచి చేస్తున్నాం..

బాణోతు కోట్యా, రైతు, ఎర్రగట్టుతండా

నాకున్న పొలంలో ఒక ఎకరం వరకు సేంద్రియ వ్యవసాయం చేస్తున్నాను. ఎనిమిదేళ్ల నుంచి వరి పంట పండిస్తున్నాను. సాధారణ సాగు కంటే ఈ సాగుకు ఎకరానికి రూ.4 వేల వరకు ఖర్చు తగ్గుతుంది. పొలంలో ఎలాంటి తెగులు కనిపించినా పురుగులు, తెగుళ్ల మందులు పిచికారి చేయం. చెట్ల ఆకులు, ఆవు మూత్రంతో తయారు చేసిన మందులతోనే నివారణ చర్యలు చేపడతాం. మేం పండించిన ధాన్యాన్ని మేమే వాడుతున్నాం. ఇతరులకు కావాలంటే ఇస్తాం. మాలాగా అందరూ ఈ విధానాన్ని పాటించేలా చేస్తాం.

పట్టు చిక్కింది

మైలా శ్రీనివాసరావు, రైతు, రామాపురం



సేంద్రియ వ్యవసాయంలో మంచి పట్టు చిక్కింది. 2007-08 వరకు ఎన్పీఎం విభాగంలో క్లస్టరు యాక్టివిస్టుగా పనిచేసిన అనుభవం ఇప్పుడు బాగా ఉపయోగపడుతోంది. సీఏగా పనిచేస్తున్న కాలంలో ఎర్రగట్టుతండాలో వెంకటరెడ్డి అనే రైతు ద్వారా 30 మందికి ఈ విధానాన్ని అలవాటు చేశాం. అప్పటి ఏవో శ్యాంసుందర్‌రెడ్డి సూచనలు పాటించాను. గతేడాది వరి పంట వేశా. మాకున్న ఎనిమిది ఎకరాల్లో ఇప్పుడు ఒక ఎకరంలో బీర, దోస, బెండ, గోరు చిక్కుడు, చిక్కుడు వంటి కూరగాయలు పండిస్తున్నా. ఇప్పటికి రూ.25 వేలు వచ్చాయి. కోదాడ, హుజూర్‌నగర్ మార్కెట్‌లో విక్రయిస్తున్నా. పంట ఉత్పత్తులే కాకుండా.. కషాయాలు కూడా కొంతమంది కోదాడలో ఇదే విధానం పాటిస్తున్న పెద్ద రైతులకు విక్రయిస్తున్నాను. వినియోగదారుల నుంచి మంచి స్పందన వస్తోంది. ఏటా సాగు విస్తీర్ణం పెంచుతా. నాణ్యమైన ఉత్పత్తులను అడుగుతున్నారు. కాబట్టి ఆర్థికంగా పుంజుకోవచ్చని నా నమ్మకం.

కృషీవలుడు

మఠంపల్లి, న్యూస్‌టుడే : రైతులు విద్యావంతులైతే వ్యవసాయం అభివృద్ధి చెందుతుందన్న జ్యోతిరావుపూలే మాటలను అక్షరాల నిజం చేశారు మఠంపల్లి మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన శాగంరెడ్డి గోపాల్‌రెడ్డి. ఎంఏ ఆంగ్లం, అర్థశాస్త్రం పూర్తి చేసిన ఆయన వ్యవసాయంపై ఉన్న మక్కువతో 1994లో హలం పట్టారు. ఆధునిక పద్ధతుల్లో ఉద్యానవన పంటలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించారు. ప్రధానంగా మామిడి, నిమ్మ, బత్తాయి, పుచ్చ, వివిధ కూరగాయలను గో-ఆధారిత సేంద్రియ ఎరువులతో సాగు చేసి లాభాలు గడించారు. శ్రీ వరి సాగులో ఎకరానికి 1010 రకం ధాన్యం 45 క్వింటాళ్లు పండించారు. 23 కేజీల బరువున్న పుచ్చ, 2.2 కిలోలు బరువున్న మామిడి కాయలు పండించి రాష్ట్ర, కేంద్ర ఉద్యానవన శాఖల నుంచి జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు అందుకున్నారు. తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఆరు ఎకరాలను ఇరవై ఏళ్లలో స్వయం కృషితో 60 ఎకరాలకు పెంచారు. ఈ నెలలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ దిగుబడులు పెంచేందుకు చేపట్టిన ఛత్తీస్‌ఘడ్, నవంబరు 14న కేంద్ర ఉద్యానవనశాఖ చేపట్టనున్న ఇజ్రాయిల్ పర్యటనకు ఆయా ప్రభుత్వాల తరపున వెళ్లనున్నారు.



గోపాల్‌రెడ్డి పండించిన యలమంద రకం మామిడి (వీటిలో కొన్ని 2.2కిలోల బరువున్నాయి)

☛ కేంద్ర ప్రభుత్వం నుంచి గుర్తింపు

☛ ఇజ్రాయిల్ పర్యటనకు ఎంపిక

అందుకున్న బహుమతులు

★ 2010-11లో 23 కిలోల బరువున్న పుచ్చకాయను పండించి అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నుంచి జ్ఞాపిక, ప్రశంస పత్రాన్ని అందుకున్నారు

★ అదే సంవత్సరం 2.2కిలోల బరువున్న ఎలమంద రకం మామిడికాయను పండించి అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచారు.

★ 2014లో తొలి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలో ఉత్తమ రైతుగా ఎంపికై రూ.10వేలు నగదు పురస్కారాన్ని అందుకున్నారు. డీఆర్ఆర్ తదితర శాఖల నుంచి పలుమార్లు జ్ఞాపికలను అందుకున్నారు.



నేటి విద్యార్థులు అటు చదువులోనూ ఇటు క్రీడల్లోనూ సత్తా చాటుతూ దూసుకెళ్తున్నారు. కనీస వసతులు లేకపోయినా, ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టినా మొక్కవోని లక్ష్యంతో క్రీడల్లో రాణిస్తూ శెభాష్ అనిపించుకుంటున్నారు. జాతీయస్థాయిలో రాణించడమే కాదు. ..అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి దేశానికి పేరు తెస్తామంటున్నారు యువ క్రీడా కెరటాలు. నిత్య సాధన.. నిరంతర తపనే క్రీడా ప్రతిభకు కొలమానమని నిరూపిస్తున్నారు. నేడు జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా వివిధ క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులపై 'న్యూస్‌టుడే' కథనం... - నల్గొండ టౌన్, న్యూస్‌టుడే.

★ వివిధ క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణిస్తున్న యువత

★ నేడు జాతీయ క్రీడల దినోత్సవం

నిత్య సాధన.. నిరంతర తపన





తైక్వాండో తేజం సాయికృష్ణ..

నల్గొండ పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన అల్వాల సాయికృష్ణ తైక్వాండో క్రీడలో జాతీయస్థాయిలో రాణిస్తూ శెభాష్ అనిపించుకుంటున్నారు. స్థానిక ప్రగతి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. మూడోతరగతి నుంచే తైక్వాండో పట్ల ఆసక్తి చూపడంతో తల్లిదండ్రులు అతని అభిరుచి మేరకు ఈ అంశంలో శిక్షణ ఇప్పించడం మొదలెట్టారు. పట్టణంలోని కోచ్ యాకస్వామి దగ్గర సాయికృష్ణ తైక్వాండో క్రీడా పాఠాలు నేర్చుకున్నారు. ఇప్పటి వరకు తైక్వాండోలో జిల్లాస్థాయిలో 25 సార్లు, రాష్ట్రస్థాయిలో 15 సార్లు, జాతీయస్థాయిలో 5 సార్లు పాల్గొని ఉత్తమ ప్రదర్శనతో బహుమతులు, ప్రశంస పత్రాలు, పతకాలు సాధించారు. ఇటీవల మలేషియాలో జరిగిన అంతర్జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు సైతం ఎంపికయ్యారు. చదువులో రాణించి ఉన్నత ఉద్యోగం సాధించాలని, తైక్వాండోలో అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి పేరు తేవాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నానని సాయికృష్ణ చెబుతున్నారు.



అథ్లెటిక్స్‌లో మెరుస్తున్న నవ్యశ్రీ..



నల్గొండ పరిధిలోని కొండారం గ్రామానికి చెందిన నవ్యశ్రీ ప్రస్తుతం నల్గొండ ప్రభుత్వ బాలికల జూనియర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఒక వైపు చదువులో ఉత్తమ ఫలితాలు సాధిస్తూనే అథ్లెటిక్స్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్నారు. 800, 1500 మీటర్ల రన్నింగ్ విభాగాల్లో ఇప్పటి వరకు జిల్లాస్థాయిలో 20 సార్లు, రాష్ట్రస్థాయిలో 10 సార్లు, జాతీయస్థాయిలో 4 సార్లు పాల్గొని పలు పతకాలు, ప్రశంస పత్రాలు అందుకున్నారు. పాఠశాల నుంచి కళాశాల స్థాయి వరకు ఉపాధ్యాయులు ఇచ్చిన ప్రోత్సాహం వల్లే అథ్లెటిక్స్ పోటీల్లో రాణిస్తున్నానని నవ్యశ్రీ చెబుతున్నారు. భవిష్యత్తులో ఒలింపిక్స్‌లో పాల్గొనాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నానని వివరించారు.



బాక్సింగ్‌లో మణిచందర్ పంచ్‌కు పతకాలు..



నల్గొండ పట్టణంలోని రాజ్‌నగర్ ప్రాంతానికి చెందిన మణిచందర్ బాక్సింగ్‌లో రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారు. ఇటీవల నల్గొండలోని కోమటిరెడ్డి ప్రతీక్ మెమోరియర్ ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో పీఈటీ ద్వితీయ సంవత్సరం పూర్తిచేశాడు. మణిచందర్‌లో ఉన్న పట్టుదలను వ్యాయామ ఉపాధ్యాయులు మల్లేష్, తేజ గుర్తించి బాక్సింగ్‌లో మెలకువలు నేర్పించడంతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించడం మొదలెట్టారు. మణిచందర్ రాష్ట్రస్థాయిలో 6 సార్లు, జాతీయస్థాయిలో ఒకసారి పాల్గొని పలు పతకాలు, ప్రశంస పత్రాలు అందుకున్నారు.



హ్యాండ్‌బాల్‌లో రాణిస్తున్న నాగజ్యోతి

నల్గొండ పట్టణం పెద్దబండకు చెందిన నాగజ్యోతి హ్యాండ్‌బాల్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. ఈమె ప్రస్తుతం నల్గొండ ఎన్జీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. చిన్ననాటి నుంచే తనకు ఇష్టమైన క్రీడ హ్యాండ్‌బాల్‌లో పట్టు సాధించి అందులో రాణిస్తున్నారు. నిరుపేద కుటుంబమైన కృషి, పట్టుదలతో కష్టపడి చదువుతునే క్రీడల్లో సత్తా చాటుతున్నారు. ఇప్పటి వరకు రాష్ట్రస్థాయిలో 10 సార్లు, జాతీయస్థాయిలో 3సార్లు పాల్గొని పతకాలు, ప్రశంస పత్రాలు అందుకుంది. హ్యాండ్‌బాల్‌తో పాటు హాకీ క్రీడలో పలుమార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చింది. హ్యాండ్‌బాల్‌లో మెరుగ్గా శిక్షణ తీసుకుని అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే తన లక్ష్యమని నాగజ్యోతి చెబుతున్నారు.



కబడ్డీలో దూసుకెళ్తున్న శ్రీకాంత్..



పెద్దవూర మండలం తుంగతుర్తి గ్రామానికి చెందిన దుగ్యాల శ్రీకాంత్ కబడ్డీ క్రీడలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్నారు. అతడు ప్రస్తుతం నల్గొండ మమత హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. చిన్ననాటి నుంచి కబడ్డీ క్రీడ అంటే అతడికి ఇష్టం. కబడ్డీపై ఉన్న ఆసక్తితో అయిదోతరగతి నుంచే సాధన ప్రారంభించి జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటడం మొదలెట్టారు. ఇప్పటి వరకు జిల్లాస్థాయిలో 10సార్లు, రాష్ట్ర స్థాయిలో 2సార్లు, జాతీయ స్థాయిలో ఒకసారి పాల్గొని పలు ప్రశంస పత్రాలు సాధించారు. మరికొన్ని సందర్భాల్లో జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషించారు.

ఫుట్‌బాల్‌లో సాయిచంద్ర సిద్ధార్థ్ దూకుడు..



నల్గొండ పట్టణానికి చెందిన బొమ్మపాల సాయిచంద్ర సిద్ధార్థ్ ఫుట్‌బాల్ క్రీడలో హవా చాటుతున్నాడు. ప్రస్తుతం హాలీయా మండల కేంద్రంలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. ఎనిమిదో తరగతి నుంచే ఫుట్‌బాల్ క్రీడలో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించడం మొదలెట్టారు. తన తండ్రి గిరిబాబు కోచ్‌గా మారి నిత్యం సిద్ధార్థ్‌కు ఫుట్‌బాల్‌లో మెలకువలు నేర్పించి తోడ్పాటు అందిస్తున్నారు. సిద్ధార్థ్ ఫుట్‌బాల్ క్రీడలో ఇప్పటి వరకు జిల్లా స్థాయిలో ఎనిమిది సార్లు, రాష్ట్ర స్థాయిలో రెండు సార్లు, జాతీయ స్థాయిలో ఒకసారి ఆడి పలు ప్రశంస పత్రాలు, పతకాలు అందుకున్నారు.



వైకల్యాన్ని జయించి..

రచయితగా రాణించి

చిత్రసీమలో అంచెలంచెలుగా ఎదుగుతున్న జీకే శ్రీనివాస్

జానపదాలే రచనకు ఉత్ప్రేరకాలు



రచయిత జీకే.శ్రీనివాస్

నీలగిరి, న్యూస్‌టుడే: బడిలో అందరి లాగా ఆడాలని, పరిగెత్తాలని ఉన్నా తన కాలు అవిటితనం అతడికి సహకరించలేదు.. తనకున్న వికలత్వంతో కుంగిపోకుండా చదువుపైన ధ్యాస పెట్టారు.. పేదరికం వెంటాడినా, నడవడానికి కాలు సహకరించకపోయినా పట్టుదలతో ఎంఏ పూర్తి చేశారు. తనకు అత్యంత ఇష్టమైన జానపదాలు రాస్తూ సంగీత కళాకారులు, రచయితల వద్ద మెలకువలు నేర్చుకున్నారు. సినిమా పాటల రచయితగా నిలదొక్కుకుంటున్నారు. మిస్ లీలావతి చిత్రంలో కోరికలే సుడిగుండమై.. సరసమే సరిహద్దు దాటె...పై ఎదను మీటెనులే.. అంటూ సాగిన ప్రేమ కావ్యం, నా హృదయం పగిలిన అద్దమై ... మరణానికి సైతం సిద్ధమై అంటూ "ఒక క్రిమినల్ ప్రేమకథ" చిత్రంలోని ఈ పాట కుర్రకారు సెల్‌ఫోన్ రింగుటోన్‌గా రింగుమంటోంది... అతడు ఏ పాట రాసినా ప్రాస కుదురుతుంది.. భావం స్పష్టంగా ఉంటుంది. చిత్రసీమలో అంచెలంచలుగా ఎదుగుతున్నారు నల్గొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని మారుమూల గ్రామం కన్నెకల్‌కు చెందిన జీకే శ్రీనివాస్.

ఇప్పటి వరకు 500కు పైగా పాటలు..

అక్షర జ్ఞానం తెలియని నిరుపేద కుటుంబంలో పుట్టి ప్రభుత్వ పాఠశాలలో చదుతున్నపుడే కవితలు, పాటలు రాయడం మొదలుపెట్టారు. ఉన్నత విద్యనభ్యసిస్తూ సంగీతం మాస్టర్ పురుషోత్తమాచార్యులు వద్ద మెలకువలు తెలుసుకుని తన రచనకు పదును పెట్టారు. నల్గొండకు చెందిన టీఎస్ విలియమ్స్ ద్వారా సంగీత దర్శకుడు ప్రవీణ్ ఇమ్మడితో పరిచయం ఏర్పడగా "ఒక క్రిమినల్ ప్రేమకథ" చిత్రానికి పాట రాసే అవకాశమొచ్చింది. ఆ పాటకు మంచి ఆదరణ పొందటంతో మిస్ లీలావతి చిత్రానికి రాయడానికి అవకాశం ఇవ్వడంతో రెండు పాటలు రాశారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న లిప్ స్టిక్ సినిమాకు అయిదు పాటలు శ్రీనివాస్ రాశారు. భక్తి కావ్యాలు, జానపదాలు, ఉద్యమాల పాటలు ఇప్పటి వరకు 500లకు పైగా రాశారు.

జానపదంతోనే పద ప్రయోగం

జీకే శ్రీనివాస్

గ్రామాల్లో అనేక మంది పాడుకునే జానపదం పాటలు ఎంతో ఆకట్టుకున్నాయి. ఇప్పటికీ జానపదం బాణీలు వచ్చేలా పద ప్రయోగం చేస్తూ పాటలు రాస్తాను. పదం, ప్రాస, భావం పాటకు ప్రధానంగా ఉండాలని నమ్ముతాను. జానపద గేయాలు, పద్యాలు రాస్తూనే అనేక భక్తి గీతాల ఆల్బమ్‌లకు పాటలు రాశాను. ఇటీవలే ఓ నిర్మాత పాటలు రాయడాని అవకాశం ఇచ్చారు. లిప్‌స్టిక్ చిత్రానికి రాసిన పాటలు బాగా వచ్చాయి. మంచి పేరు వస్తుందని ఆశిస్తున్నాను. సంగీత దర్శకుడు, నటుడు ఆర్పీ పట్నాయక్ కొన్ని బాణీలు విని బాగున్నాయని ప్రశంసించారు.



ప్రముఖ సంగీత దర్శకుడు, నటుడు ఆర్పీ పట్నాయక్‌తో శ్రీనివాస్

పని చేస్తూ.. పని కల్పిస్తూ..

● స్వయం ఉపాధి బాటలో మహిళలు

● ఆత్మవిశ్వాసంతో ఎదగాలన్నదే లక్ష్యం

వారంతా మధ్య తరగతికి చెందిన మహిళలు.. ఆర్థిక సమస్యలు, సాధకబాధకాలు ఎలా ఉంటాయో వారికి అనుభవమే.. ప్రతి ఆర్థిక అవసరానికి కుటుంబ పెద్దపై ఆధారపడడం, రోజురోజుకు పెరుగుతున్న ఖర్చులతో ప్రతి పైసా సంపాదనకు ఎంత కష్టపడాల్సి వస్తుందో నిత్యం చూస్తున్నవారే. . తమకున్న తెలివితేటలను ఉపయోగించుకుని కుటుంబ ఆర్థిక అవసరాలకు చేదోడుగా నిలవాలని నిర్ణయించుకున్నారు. ఇదే విషయాన్ని తమ జీవిత భాగస్వామితో చర్చించి పక్కా ప్రణాళికతో స్వయం ఉపాధి దిశగా ముందుకు అడుగేశారు. ఒకరు దుస్తుల తయారీ రంగంలో పదిమందికి ఉపాధి కల్పిస్తూనే ఆదాయాన్ని సమకూర్చుకుంటుండగా, మరొకరు విస్తళ్ల తయారీలో వేగంగా దూసుకువెళుతున్నారు. చిట్యాల మండలానికి ఇద్దరి మహిళలపై ప్రత్యేక కథనం.

– చిట్యాల, న్యూస్‌టుడే

ఉపాధి కల్పన

తాను పనిచేసుకుంటూనే పది మందికి ఉపాధి కల్పిస్తున్నారు గుండ్రాంపల్లికి చెందిన పాపని వనజ. పదేళ్ల క్రితం ఖాళీగా ఇంటి పట్టున కూర్చోవడం ఎందుకని తనకు అప్పటికే వచ్చిన కుట్టుపనిని స్వయం ఉపాధి మార్గంగా ఎంచుకున్నారామె. దీనికితోడు ఆధునిక డిజైన్లతో దుస్తుల తయారీ, బెడ్‌షీట్లు, పిల్లో కవర్లు, దీవాన్‌సెట్లు వంటివి కూడా తయారు చేసే కోర్సులో శిక్షణ పొందారు. గ్రామంలో మరికొంత మందిని చేరదీసి తనకు వచ్చిన కళను నేర్పించారు. తన భర్త సహకారంతో ఇతర ప్రాంతాల నుంచి ఆర్డర్లు తెచ్చుకుని గ్రామంలోని పలువురు మహిళలకు పీస్ పద్ధతిలో పని కల్పించి వారికి కూడా నెలకు రూ.4వేల నుంచి రూ.5వేల ఆదాయ మార్గాన్ని కల్పించారు. తాను రూపొందించిన డ్రెస్ మెటీరియల్‌ను హైదరాబాద్, భూదాన్‌పోచంపల్లి మార్కెట్లతోపాటు వివిధ చేనేత ప్రదర్శనలకు వెళ్లే వారికి కూడా విక్రయిస్తున్నారు. ఇంటి పట్టునే ఉంటూ వనజ నెలకు రూ.40వేల దాకా ఆదాయం సంపాదిస్తున్నారు. ఆన్‌లైన్‌లో దుస్తుల క్రయవిక్రయాలు చేపట్టాలని లక్ష్యంగా నిర్ణయించకున్నానని ఆమె వివరించారు. ఆత్మవిశ్వాసంతో ఏదైనా సాధించొచ్చని చెబుతున్నారు.






మార్కెట్‌కు సిద్ధం చేసిన దుస్తుల మెటీరియల్‌తో వనజ

2,500 నుంచి 8వేల ఉత్పతి దాకా

చిట్యాలకు చెందిన మెండె పార్వతి దంపతులు ఒక ప్రైవేటు పరిశ్రమలో పనిచేసేవారు. కొన్ని కారణాల వల్ల పరిశ్రమ మూతపడడంతో పార్వతి దృష్టి స్వయం ఉపాధివైపు మళ్లింది. తనకు వచ్చిన ఆలోచనను భర్తతో చర్చించి 2000 సంవత్సరంలో విస్తళ్ల తయారీ యూనిట్‌ను రూ.50వేల వ్యయంతో ప్రారంభించారు. రోజుకు 2వేల పైచిలుకు విస్తళ్లు తయారుచేసేవారు. రోజుకు కనీసంగా రూ.300 గిట్టుబాటయ్యేది. కష్టపడి పనిచేసి విస్తళ్ల యూనిట్ సామర్థ్యాన్ని క్రమంగా పెంచుకున్నారు. చిత్తశుద్ధితో పార్వతి సాగిస్తున్న కృషిని గుర్తించి బ్యాంకర్లు సహకరించారు. ప్రస్తుతం రోజుకు ఒక్కొక్కటి 8 వేల విస్తళ్లు తయారు చేసే రెండు ఆటోమెటిక్ యంత్రాలను సమకూర్చుకున్నారు. విస్తరిపై నాలుగు పైసల లాభం చూసుకుని వ్యాపారం సాగిస్తున్నారు. 12 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. వారికి నెలకు రూ.5వేల దాకా ఆదాయం లభిస్తోంది. తయారుచేసిన విస్తళ్లను నల్గొండ, సూర్యాపేట, భువనగిరి, చిట్యాల, రామన్నపేట ప్రాంతాల్లో ఆర్డర్లపై విక్రయిస్తున్నారు. పక్కా ప్రణాళికతో ముందుకు వెళితే మహిళలు సాధించలేని ఉండదని నిరూపిస్తున్నారు పార్వతి.

ఆటలకు ప్రోత్సాహం శూన్యం



మైదానం లేని రుస్తాపూర్ ఉన్నత పాఠశాల

భువనగిరి క్రీడా విభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామోపాధ్యాయలు ఉంటారు. కానీ క్రీడా మైదానాలుండవు. కొన్ని చోట్ల క్రీడా మైదానాలుంటాయి కానీ వ్యాయామోపాధ్యాయులు ఉండరు. ఒకవేళ ఈ రెండు ఉంటే క్రీడలకు కావాల్సిన కనీస మౌలిక సదుపాయాలు ఉండవు. ఇదీ జిల్లాలోని పాఠశాలల్లో ఆటల దుస్థితి. యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా 95 పాఠశాలకు వ్యాయామోపాధ్యాయుల పోస్టులు మంజూరు ఉన్నాయి. అందులో 19 ఖాళీలున్నాయి. వీటిలో 17 పీఈటీ పోస్టులు, 2 పీడీ పోస్టులు. నిబంధనల ప్రకారం ప్రతీ ఉన్నత పాఠశాలకు 5 ఎకరాలు, ప్రాథమికోన్నత పాఠశాలకు 2 ఎకరాలు, ప్రాథమిక పాఠశాలకు ఒక ఎకరం, జూనియర్ కళాశాలకు ఏడెకరాల క్రీడా మైదానాలుండాలి. కానీ ఇక్కడ అలాంటి పరిస్థితులు లేవు. జిల్లాలో 27,790 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుచున్నారు. వారిలో బాలురు 13,854, బాలికలు 13,936 మంది ఉన్నారు. అయినా విద్యార్థులు క్రీడలలో రాణించలేకపోతున్నారు.

క్రీడలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి:

కృష్ణమూర్తి, వ్యాయామ ఉపాధ్యాయుడు



ప్రతీ పాఠశాలకు ఏటా ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలి. ప్రభుత్వాలకు క్రీడలపై ప్రత్యేక ప్రణాళికలు లేవు. ప్రోత్సాహం లేకపోవడంతో విద్యార్థులు క్రీడలలో రాణించలేకపోతున్నారు. జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు కూడా ఉద్యోగావకాశాలు లేకపోవటంతో సాధారణ పనులతో జీవించాల్సి దుస్థితి నెలకొంది. వీటన్నింటిని అధిగమించినపుడే విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో క్రీడలలో రాణిస్తారు.

శిక్షకుడున్నా.. ఆట స్థలం లేదు

తుర్కపల్లి, న్యూస్‌టుడే: తుర్కపల్లి మండలంలోని రుస్తాపూర్ ఉన్నత పాఠశాలలో క్రీడా రంగం పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఇక్కడ 176 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. సరైన మైదానం లేక విద్యార్థులు ఆటల్లో వెనకబడి పోతున్నారు. ఇక్కడ మరో విశేషమేమిటంటే విద్యార్థులు ప్రార్థన చేయటానికి కూడా స్థలం సరిపోవటం లేదు. మంచి శిక్షకుడు ఉన్నప్పటికీ సరైన ఆట స్థలం అందుబాటులో లేకపోవటంతో విద్యార్థులు నిరాశ చెందుతున్నారు. అసౌకర్యాలతో ఇబ్బందులు పడుతూనే పాఠశాల నుంచి విద్యార్థులు కబడ్డీ, పరుగు పందెం, షాట్‌పుట్ రంగాలలో రాణిస్తున్నారు. మంచి నైపుణ్యం కలిగి ఉన్నా మరింత శిక్షణ పొందే అవకాశాలు లేక క్రీడల్లో విద్యార్థులు వెనకబడిపోతున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు క్రీడా స్థలం కేటాయించాలని విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మైదానం ఉన్నా.. మాస్టారు లేరు

బీబీనగర్, న్యూస్‌టుడే: కబడ్డీ ఆటకు చిరునామాగా నిలిచిన బీబీనగర్ మండలం జమిలాపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అన్ని వసతులున్నా విద్యార్థులకు ఆటలు నేర్పించే ఉపాధ్యాయుడు లేరు. దీంతో విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలు బయటకు రావడం లేదు. మండలంలో 8 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 5 పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు. మగ్ధంపల్లి, చిన్నరావులపల్లి, జమిలాపేట్ గ్రామాల్లోని మూడు పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులు లేరు.

క్రీడా సామగ్రి అందుబాటులో ఉంచాలి: తూనిక విజయ్‌సాగర్,

వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నప్పటికి విద్యార్థులకు సరైన ఆట వస్తువులు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో క్రీడా సామగ్రికి ప్రత్యేక నిధులు కేటాయించాలి. విద్యార్థి పాఠశాల స్థాయి నుంచి సహజంగా ఎదిగినపుడే జీవితంలో అన్ని ఎదుర్కోగలడు. ముఖ్యంగా పాఠశాల దశలో చదువుతో పాటు మానసికంగా, శారీరకంగా ఎదగడానికి వ్యాయాయ ఉపాధ్యాయుడి కృషి ఎంతగానో ఉంటుందని అందుకనే ప్రతి పాఠశాలలో వ్యాయాయ ఉపాధ్యాయుడిని నియమించాలి.

పసిప్రాయం క్రీడలకు దూరం

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: ఆడేందుకు స్థలమున్నా కొన్ని పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు కరవయ్యారు. చాలా ఏళ్లుగా ఇక్కడ పీఈటీలు లేక విద్యార్థులు ఆటలకు దూరంగా ఉన్నారు. ఆడాలనే ఆసక్తి ఉన్నా ప్రోత్సహించే నాధుడే లేరు. భువనగిరి మండలంలో 12 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలున్నా ఏడుగురే పీఈటీలు ఉన్నారు. ప్రాథమిక పాఠశాల నుంచి ఉన్నత పాఠశాలగా ఉన్నతీకరించి ఏళ్లు గడుస్తున్నా వీరవల్లి, కూనూరు, బండసోమారం, తుక్కాపురం, హన్మాపురం పాఠశాలలో పీఈటీల పోస్టుల నియామకం కాలేదు. దీంతో ఈ గ్రామాల నుంచి మండల, డివిజన్ స్థాయిలకు కూడా పోటీలకు ప్రధానోపాధ్యాయులు పంపించే సాహసం చేయడం లేదు. ఆ గ్రామాలక విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆటల్లో శిక్షణ ఇవ్వకపోవడంపై విచారం వ్యక్తం చేస్తున్నారు.

ప్రాథమిక స్థాయిలో వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాలి:

సోలిపురం వెంకట్‌రెడ్డి, కార్యదర్శి,
జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం

ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పూర్తి స్థాయిలో వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాలి. అప్పుడే మండల స్థాయి నుంచి జాతీయ స్థాయిలో క్రీడలు అభివృద్ధి చెందుతాయి.

రసాభాసగా గ్రామ సభ

దుబ్బాక (రామన్నపేట), న్యూస్‌టుడే: దుబ్బాకలో సోమవారం ఏర్పాటు చేసిన గ్రామసభ రసాబాసాగా సాగింది. గ్రామ శివారులో కోళ్లఫాం నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ కొందరు గ్రామస్థులు జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు గ్రామసభ నిర్వహించి ప్రజాభిప్రాయం సేకరించాలని కలెక్టరు ఆదేశాలు ఇవ్వటంతో ఎంపీడీవో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కోళ్లఫాం ఏర్పాటుతో వాతావరణ, నీటి కాలుష్యంతో పాటు దోమలు, ఈగలు వ్యాపిస్తాయని అధికారులకు వివరించారు.



దుబ్బాకలో గ్రామసభను నిర్వహిస్తున్న అధికారులు

తమ అభ్యంతరాలను పరిశీలించాలని అధికారులను కోరారు. దీనిపై కోళ్లఫాం నిర్మాణదారుడు కొండల్‌రావు వివరణ ఇస్తూ గ్రామ పంచాయతీ అనుమతితో నిబంధనల మేరకు గ్రామానికి దూరంగా కోళ్లఫాం నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ సమయంలోనే రెండు వర్గాలుగా విడిపోయిన గ్రామస్థులు కోళ్లఫాం ఏర్పాటుకు వ్యతిరేక, అనుకూల నినాదాలు చేయడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామస్థులు శాంతియుతంగా తమ అభిప్రాయం తెలపాలని కోరారు. లేని పక్షంలో గ్రామ పంచాయతీ ఇచ్చిన తీర్మాణం మేరకు కోళ్లఫాం నిర్మించుకునే అవకాశం కలుగుతుందని పలుమార్లు ప్రకటించినప్పటికీ వివాదం సద్దుమణగలేదు. ఇలా వివాదాల నడుమ ఎంపీడీవో గ్రామసభను ముగించారు. అనంతరం ఎంపీడీవో విలేకరులతో మాట్లాడుతూ గ్రామ శివారులో కోళ్లఫాం నిర్మాణంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ నూల సిద్దప్ప, జనార్ధనరెడ్డిలతో పాటు 96 మంది సంతకాలతో కూడిన ఫిర్యాదు వచ్చిందని తెలిపారు. విచారణ సమయంలో ఆరుగురు కోళ్లఫాం నిర్మాణానికి వ్యతిరేకంగా తమ అభిప్రాయం తెలుపగా వీరిలో ఇద్దరు స్థానికేతరులని ఎంపీడీవో తెలిపారు. ఈ విషయంపై కలెక్టరుకు నివేదిక అందజేస్తామని, కలెక్టరు ఆదేశాలకనుగుణంగా తదుపరి చర్యలు ఉంటాయని చెప్పారు.

న్యాయస్థానం తీర్పు అమలులో నిర్లక్ష్యం

భువనగిరి టౌన్, న్యూస్‌టుడే: న్యాయస్థానాలు ఇస్తున్న తీర్పులను అమలు పర్చడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సిరెడ్డి ఆరోపించారు. కేజీబీవీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా అమలు కావడం లేదని చెప్పారు. ఉద్యోగ స్వభావాన్ని కాకుండా పనిని బట్టి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పదో పీఆర్సీ ఆధారంగా కేజీబీవీ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖలో మహిళా ఉద్యోగులకు వర్తించే అన్ని సదుపాయాలు, భత్యాలు వారికీ చెల్లించాలన్నారు. ప్రసూతి సెలవు, వేసవి సెలవుల్లో వేతనాలు చెల్లించాలన్నారు. ఈ డిమాండ్లతో అక్టోబర్ 4న హైదరాబాదులో మహాధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముక్కెర్ల యాదయ్య, సిల్వేరు మహేష్, దశరథ, వెంకన్న, శ్రీనివాస్, గణేష్ నాయక్, రాజేంద్ర, అఫ్రోజ్, కవిత, అరుణ, రాధిక పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

కేజీబీవీ బోధనేతర కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నాయకులు, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని నాయకుడు జనార్దన్ డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, విద్యాలయాల్లో కనీస సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఫియా, పద్మ, కవిత, శోభ, భారతి, అనిత, విజయ, కొండల్‌రావు, నాగమణి, రమాదేవి, రామ లింగమ్మ, పాల్గొన్నారు.



ధర్నా శిబిరంలో మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సిరెడ్డి


గోదాముల సామర్థ్యం పెంచుతాం

భువనగిరి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ధాన్యం, ఇతర వ్యవసాయ దిగుబడులను దృష్టిలో పెట్టుకుని అదనంగా గోదాముల నిర్మాణానికి తమ సంస్థ చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ మందుల సామేల్ తెలిపారు. సోమవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. త్వరలో ఖమ్మం, నల్గొండ, పాల్వంచలో 32వేల టన్నుల సామర్థ్యంగల గోదాముల నిర్మాణం చేపట్టబోతున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రంలో గోదాముల నిర్మాణంలో అప్పటి పాలకులు వివక్ష చూపారని విమర్శించారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం కార్మికులు, హమాలీల కోసం రాష్ట్రంలో 87 గోదాముల్లో రూ. 3.18 కోట్లతో కనీస వసతులు కల్పిస్తోందన్నారు. గత ఏడాది లక్ష మెట్రిక్ టన్నుల కందుల దిగుబడి రాగా, కర్ణాటక, మహారాష్ట్రకు ఎగుమతి చేశామని చెప్పారు ప్రస్తుతం 78వేల మెట్రిక్ టన్నుల కందులు నిల్వ ఉన్నాయన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ పంతులు నాయక, వైస్ ఛైర్మన్ పరమేశ్వర్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు గోమారి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు నాగారం అంజయ్య, మొలుగు లక్ష్మయ్య, కంచెనపల్లి నర్సింహరావు, పుట్ట వీరేశ్ పాల్గొన్నారు. తొలుత ఆయన కిసాన్‌నగర్‌లోని గోదాంలో మొక్క నాటారు.

